ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 8 జూలై 2025
గరిష్ఠం 34.5
కనిష్ఠం 22.0

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	529.10 (166.3946)	58,780	4,724
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.65 (3.60)	68.78	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	154.329 (19.5)	నిల్	7,000

చికెన్ ధరలు: లైవ్: రూ.125 | డ్రెస్: రూ.190 | స్కిన్‌లెస్: రూ.210

వైటీపీఎస్‌కు లోటు లేకుండా బొగ్గు!

- రవాణాలో ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయం
- రైల్వే, జెన్‌కో అధికారులతో జెన్‌కో సీఎండీ సమీక్ష
- సరఫరాకు సన్నాహాలు
- డిసెంబరు నుంచి రోజూ 14 ర్యాకుల ద్వారా 50వేల మెట్రిక్‌టన్నుల బొగ్గు



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటుకు అవసరమైన బొగ్గు సరఫరాపై జెన్‌కో, రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది.4వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ పవర్ ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి వస్తే ప్రతి రోజూ కనీసం 50వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరమని అధికారులు అంచనావేశారు. ఈ బొగ్గు ను సింగరేణి సంస్థ సరఫరా చేయనుంది. సింగరేణి నుంచి ప్రతి రోజూ కనీసం 12 నుంచి 14 రైల్వే ర్యాకుల ద్వారా రవాణా చేస్తేనే ప్లాంటుకు అవసరమైన బొగ్గు అందుబాటులో ఉంటుంది. బొగ్గు రవాణా కార్యాచరణ నిమిత్తం సోమవారం హైదరాబాద్‌లో విద్యుత్ సౌధలో జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జెన్‌కో, దక్షిణ మధ్య రైల్వే అధికారులు బొగ్గురవాణాపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో ప్రస్తుతం యూనిట్-2 (800 మెగావాట్లు)లో విద్యుదుత్పాదన జరుగుతోంది. యూనిట్-1 ఈ నెలాఖరులోగా కమిషన్ కానుండగా, మిగిలిన మూడు యూనిట్లు వచ్చే ఫిబ్రవరి

మిగతా 8వ పేజీలో...

సంస్థాగత ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్



స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కమిటీల నియామకాలు పూర్తిచేయాలని, ఈనెల 30లోగా అన్నిస్థాయిల్లో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. గ్రామ, మండల, బ్లాక్, పట్టణ, జిల్లా కమిటీల నియామకాల కోసం ఇప్పటికే సన్నాహక సమావేశాలు, ప్రాథమిక జాబితాల రూపకల్పన పూర్తయింది.

– (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- ఈనెల 30లోగా అన్ని కమిటీల నియామకం
- స్పష్టమైన ఆదేశాలిచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

స్థానిక ఎన్నికల్లో పోటీపై, నామినేటెడ్ పదవులపై స్పష్టత వస్తే తప్ప ఈ పదవులు తీసుకునేందుకు పలువురు నాయకులు సిద్ధంగా లేరు. దీంతో ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు రంగంలోకి దిగి పదవులు తీసుకునేలా వారిని బలవంతంగా ఒప్పించే పరిస్థితి జిల్లాలోని పలు పట్టణాలు, మండలాల్లో నెలకొంది. ఈనెల 30లోపు సంస్థాగత ఎన్నికలను పూర్తిచేసే నిమిత్తం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఇన్‌చార్జిగా ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ.సంపత్‌కుమార్‌ను అధిష్ఠానం సోమవారం నియమించింది. దీంతో త్వరలో జిల్లాలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ చివరిదశకు చేరనుంది.

డీసీసీపై కొనసాగుతూనే ఉన్న ఉత్కంఠ...

రాష్ట్రంలోనే పెద్ద జిల్లా కావడంతో పాటు, కీలక నేతలున్న నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం కీలక నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పీసీసీ ఉపాధ్యక్షులుగా నియమితులైన గుమ్మల మోహన్‌రెడ్డి, కొండేటి మల్లయ్యతో పాటు పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత, తదితర నాయకులు ఈ పదవి దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. మంత్రి, మాజీ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆశీస్సులు సాధించడం ద్వారా పదవి దక్కించుకునేందుకు వీరు ప్రయత్నాలు చేస్తుండడంతో ఎవరిని వరించనుందనేది ఆసక్తికరంగా మారింది. డీసీసీ అధ్యక్ష పదవిపై అధిష్ఠానం ఒక నిర్ణయానికి వస్తే, ఆ తదుపరి బ్లాక్, మండల, గ్రామ కమిటీల నియామకాలను ఇప్పటికే సిద్ధం చేసిన జాబితా మేరకు ప్రకటించేందుకు పార్టీ రంగం సిద్ధం చేసింది. నూతనంగా నియమితులైన పార్టీ ఇన్‌చార్జి సంపత్‌కుమార్ వారం, పది రోజుల్లో ఈ పదవుల నియామకాలపై తుది జాబితాను ఖరారుచేసి పీసీసీ అధ్యక్షుడికి ఇవ్వనున్నట్లు సమాచారం.

పట్టణ కమిటీ అధ్యక్ష పదవులపై నజర్

కీలకమైన నల్లగొండ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి పోటాపోటీ నెలకొంది. ఈ పదవిని పట్టణ నాయకులు అల్లి సుభాష్‌యాదవ్, పాదం అనిల్‌కుమార్, గోగుల గణేశ్, పెరిక వినాయకరాజ్ (చిట్టి), మహ్మద్ సమ్మద్ తదితరులు ఆశిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడం, జిల్లా కేంద్రం కావడంతో ఈ పదవికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు, మంత్రి కోమటిరెడ్డి ఆశీస్సులు పొందేందుకు నాయకులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో మరో కీలకమైన మిర్యాలగూడ

మిగతా 8వ పేజీలో...

‘ప్రజావాణి’ ఫిర్యాదులపై దృష్టిసారించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ‘ప్రజావాణి’ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ‘ప్రజావాణి’లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా స్థాయిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు మండల స్థాయికి పంపుతున్నారని, అలా చేయకుండా వారి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్‌కార్డుల దరఖాస్తులను పౌరసరఫరాల అధికారులు పర్యవేక్షించాలని, దరఖాస్తు తిరస్కరణకు గురైతే దరఖాస్తుదారులకు విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు వారి పరిధిలోని కేజీబీవీలను తనిఖీచేయాలన్నారు. కేజీబీవీల్లో తక్షణ పనుల నిమి త్తం రూ.20వేలు మంజూరు చేశామని, ప్రత్యేక అధికారులు వారికి నచ్చిన పనులు కాకుండా, అవసరమైన వాటిని ప్రతిపాదించాలన్నారు. చాలా కేజీబీవీల్లో కోతుల బెడద ఉందని, ఫెన్సింగ్ అవసరం ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

భూములపై గిరిజనులకు హక్కులు కల్పిస్తాం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో భూ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూములపై హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే వివిధ నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీశాఖకు చెందినవని అటవీ అధికారులు కొర్రీలు పెడుతున్నారని అన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. పేద ప్రజలు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలన్నారు. చిన్న సమస్యలను సాకుగా చూపి విషయాన్ని జటిలం చేయవద్దని అధికారులకు సూచించారు. సమావేశంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, రెవెన్యూశాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్‌కుమార్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఫారెస్ట్ అధికారి రత్నాకర్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, నారాయణ్ అమిత్, పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పాల్గొన్న జానారెడ్డి, జైవీర్‌రెడ్డి

ఇంటర్‌లో విద్యార్థుల నమోదును పెంచాలి

కనగల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా కనగల్‌లో ఏర్పాటుచేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారి భీమ్‌సింగ్ అన్నారు. ఐఏఎస్ క్రిష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు సోమవారం కళాశాలను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది వివరాలను ప్రిన్సిపాల్ సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగామాట్లాడుతూ అధ్యాపకులు చెప్పే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని మంచి ఫలితాలు సాధించాలన్నారు. క్రీడాసామాగ్రి కొనుగోలుకు కళాశాలకు రూ.10వేలను మంజూరు చేస్తానన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో భీమ్‌సింగ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డీఐఈవో దస్రూనాయక్ తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భీమ్‌సింగ్

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు ఫోన్‌చేసి ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చే స్తున్నామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎస్పీ కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులను తీసుకురావద్దని, బాధితులు ప్రత్యక్షంగా కలిసి సమస్యలను వివరించి పరిష్కారం పొందాలని సూచించారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఖయ్యుంబేగ్

రాజకీయ లబ్ధికోసమే
రోడ్డును అడ్డుకునే కుట్ర

నల్లగొండ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొంతమంది ముస్లిం నాయకులు వారి రాజకీయ లబ్ధి కోసమే లతీఫ్‌సాహెబ్ గుట్టపైకి రోడ్డు నిర్మించకుండా అడ్డుకోవాలని చూస్తున్నారని కాంగ్రెస్ మాజీ ప్రజా ప్రతినిధులు మహమ్మద్ ఖయ్యుం బేగ్, మహమ్మద్ ఇబ్రహీం, సయ్యద్ సమద్, మహమ్మద్ బషీరుద్దీన్ విమర్శించారు. సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లతీఫ్‌సాహెబ్ గుట్టతో పాటు బ్రహ్మంగారి గుట్టకు రోడ్డు నిర్మాణానికి రూ.140 కోట్లు మంజూరు చేయించారన్నారు. కొంతమంది నాయకులు ఒక వీడియోను విడుదల చేసి హద్దులు మీరి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, దీన్ని సహించేదిలేదని హెచ్చరించారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి కోట్ల రూపాయలతో లతీఫ్‌సాహెబ్ గుట్టకు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని చెప్పి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కోమటిరెడ్డి మంత్రి అయ్యాక గుట్టపైకి రోడ్డు నిర్మాణానికి సర్వే చేయించి నిధులు మంజూరు చేయించారన్నారు. సమావేశంలో ఫసహత్ అలీబాబా, మహమ్మద్ ఇర్ఫాన్, మహమ్మద్ మహబూబ్‌అలీ, అమేర్, ఖలీల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జహంగీర్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు

నల్లగొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు ఉన్నాయని ప్రధానంగా యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని జేడీఏ శ్రవణ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 57,270మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులు ఉన్నాయన్నారు. ఇందులో 24,929 మెట్రిక్‌టన్నుల యూరియా, డీఏపీ 2,926, ఎంవోపీ 2,269, ఎన్‌పీకేఎస్ 25,580, ఎస్‌ఎస్‌పీ 1,425మెట్రిక్ టన్నులు ఉందన్నారు. అదే విధంగా ఎఫ్‌వోఎం 35,700, కంపోస్టు ఎరువులు 103 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. ఎమ్మార్పీకి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలని ఏ ఒక్క రైతు కూడా అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని సూచించారు. అవసరం మేరకు యూరియాను కొనుగోలు చేయాలని కొంత మంది యూరియా దొరకదన్నా అపోహలతో ముందుజాగ్రత్తగా కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన తరువాత తప్పనిసరిగా రశీదును జాగ్రత్త పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జేడీఏ శ్రావణ్‌కుమార్

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

- ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చెర్వుగట్టులో బిల్లాల సత్తిరెడ్డికి చెందిన 17.5ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరికి ప్రత్యామ్నాయంగా మూడు రెట్లు అధిక దిగుబడి, లాభాలను వచ్చే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టిసారించాలన్నారు. ఎకరానికి 57 మొక్కలు నాటవచ్చని, నాలుగో ఏట నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఎకరానికి కనిష్ఠంగా 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని, దీంతో రూ.1.20లక్షల నుం చి రూ.1.50లక్షల వరకు ఆదాయం సమకూరుతుందన్నారు.

మిగతా పంటలతో పోల్చితే ప్రకృతి వైపరీత్యాల నుంచి తట్టుకోవడమేగాక చీడ పీడల బెడద ఉండదన్నారు. మూడో ఏట నుంచి ఆయిల్‌పామ్ లో అంతర్‌పంటలు సాగు చేయవచ్చన్నారు. వంద శాతం రాయితీతో మొక్కలు పొందడమేగాక డ్రిప్ పరికరాలను కూడా సబ్సిడీపై ఇస్తామన్నారు. మొక్కల పెంపకానికి ఏటా ఎకరానికి రూ.4,200 చొప్పున నగదు బదిలీ ద్వారా నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖాధికారి శ్వేత, పతంజలి ఫుడ్స్ జిల్లా జీఎం రవీందర్‌రెడ్డి, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు వినయ్, శ్రీనివాస్, వంశీ, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, నర్సిరెడ్డి, రాములు, విజయ్,తదితరులు పాల్గొన్నారు.



చెర్వుగట్టులో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరెడ్డి

బీఆర్‌ఎస్ వల్లే పనులు నత్తనడక

మర్రిగూడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే చర్లగూడెం రిజర్వాయర్ పనులు నత్తనడక నడుస్తున్నాయని ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రిజర్వాయర్లలో భూములు కోల్పోయి ముంపునకు గురైన గ్రామాల బాధిత భూనిర్వాసితులకు సరైన సమయంలో పరిహారం, పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించడంలో నిర్లక్ష్యం చేయడంతో పనులు నిలిచాయన్నారు. మండల ఇన్‌చార్జి కన్వీనర్ బుర్ర శేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎడ్ల పెద్దులు, అయితగోని యాదయ్య, జాల చంద్రయ్య, కారింగ్ యాదయ్య, దాసరి జంగయ్య, లక్ష్మమ్మ, మల్లయ్య, వీరితో పాటు పలువురు ఎమ్మెల్సీ సత్యం సమక్షంలో సీపీఐలో చేరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

పనులను తనిఖీచేసిన కేంద్ర బృందం

నాంపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిధులతో నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పలు అభివృద్ధి పనులను నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కేజీ.సలీంకుమార్, పీఆర్.సలీంమోన్ స్థానిక అధికారులతో కలిసి సోమవారం తనిఖీచేశారు. అదేవిధంగా మండల పరిధిలోని రాజ్యాతండాలో చేపట్టిన అభివృద్ధి పనులను వారు తనిఖీచేశారు. కేంద్ర నిధుల అమలుచేస్తున్న వితంతు, దివ్యాంగుల, వృద్ధాప్య పెన్షన్, జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను తనిఖీచేసి సంబంధిత రికార్డులను పరిశీలించారు. మండల కేంద్రంలోని నర్సరీలను, గ్రామపంచాయతీ కార్యాలయంలోని రికార్డులను వారు పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కేంద్రం అమలుచేస్తున్న పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బండతిమ్మాపురం గ్రామపంచాయతీ పరిధిలోని పగిడిపల్లిలో నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో రామకృష్ణశర్మ, ఏపీవో గుంటుక వెంకటేశం, ఏపీఎం వినోద్, పంచాయతీరాజ్ ఏఈలు రామకృష్ణ, ఉదయ్‌రెడ్డి, తులసి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


సైదులు(ఫైల్)

నేరేడుచర్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): చేపల వేట కోసం వెళ్లి చెరువులో జారిపడి వ్యక్తి మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన పర్సనబోయిన సైదులు(47) ఆదివారం రాత్రి నేరేడుచర్ల మండలం దాచారం గ్రామ శివారు లోని అతని పొలం వద్ద నారుమడి చూసేందుకు వచ్చాడు. పక్కనే ఉన్న ఎర్రగుంట చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. సైదులు కుమారుడు పర్సనబోయిన రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఒక కేసులో అరెస్టు చేస్తే మరోకేసు బయటపడింది


వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

చిట్యాల, జూలై 7,(ఆంధ్రజ్యోతి): ఒక కేసులో అరెస్టు చేస్తే.. మరో కేసు బయటపడింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సోమవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు కేసు వివరాలు వెల్లడించారు. స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్నారని సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో చిట్యాల పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఎస్ఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లి అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కిలో 250 గ్రాముల గంజాయి, మూడు గడియారాలు, ఒక ల్యాప్‌టాప్, ఒక ఆటో, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.5లక్షల వరకు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. వారిని హైదరాబాద్‌లోని బీఎన్‌రెడ్డికాలనీకి చెందిన దండుగుల శివకుమార్, తలారి మనోజ్‌కుమార్‌గా గుర్తించారు.

మరో కేసు బయటపడిందిలా..

నిందితుల వద్ద ఉన్న గడియారాలు, ల్యాప్‌టాప్ గురించి ఆరా తీయగా తాము గత నెల 30వ తేదీన చిట్యాలలోని చంద్రపురికాలనీలో నివాసముంటున్న కెనరా బ్యాంక్ వట్టిమర్తి శాఖ మేనేజర్ గుంటూరు చైతన్య ఇంట్లో దొంగతనం చేసిన్నట్లు ఒప్పుకున్నారని ఎస్ఐ తెలిపారు. జల్సాలకు అలవాటు పడిన నిందితులు గంజాయి విక్రయించడంతో పాటు తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. కేసును చేధించిన హెడ్‌కానిస్టేబుళ్లు మధు, రాంబాబు, కానిస్టేబుళ్లు వెంకన్న, ఖలీమ్, సాయి, ఆనంద్, జాన్‌రెడ్డిని సీఐ అభినందించారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ: బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ గంజాయి విక్రయిస్తున్న యువకుడిని ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ అధికారులు అరెస్ట్ చేశారు. నల్లగొండ జిల్లా వాడపల్లి లక్ష్మీపురం గ్రామానికి చెందిన సయ్యద్ రంజాన్ అలీ, పంజాగుట్టలోని లక్ష్మీ నరసింహ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ గంజాయి విక్రయిస్తున్నాడు. ఏపీ పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన దాదు అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి, నగరంలో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం నిఘా పెట్టింది. పంజాగుట్ట పిల్లర్ నెంబర్ 1087 ఆటోస్టాండ్ వద్ద గంజాయి విక్రయించేందుకు వచ్చిన రంజాన్ అలీని అరెస్ట్ ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి 450 గ్రాముల గంజాయి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

తాటిచెట్టు పైనుంచిపడి గీతకార్మికుడు మృతి


చెనగోని బిక్షం(ఫైల్)

కనగల్, జూలై 7:(ఆంధ్రజ్యోతి): తాటిచెట్టుపై నుంచిపడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని పర్వతగిరి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు చెనగోని బిక్షం(55) సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని తాటి చెట్టు నుంచి కల్లు తీస్తున్న క్రమంలో చెట్టుపై నుంచి జారి కింద పడిపోయాడు. బిక్షంకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భిక్షంను 108 వాహనంలో నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడని గ్రామస్థులు తెలిపారు.

వెండీ పట్టీలు అందజేత

యాదగిరిగుట్ట, జూలై 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనార్థం సోమవారం జనగాం జిల్లా ఘణపూర్ మండలం సిరిపురానికి చెందిన చిలుకూరు జ్యోతికి చెందిన 8 తులాల వెండి కాలి పట్టీలు పోగొట్టుకున్నారు. కొండపైన బస్టాండ్ ప్రాంగణంలో కనిపించగా వాటిని హోంగార్డ్ గట్టు శేఖర్, భద్రపర్చి మైక్ అనౌన్స్ చేశారు. ఈ మేరకు విచారించి భక్తురాలికి అప్పగించారు. విధుల్లోని ఎస్పీఎఫ్ ఏఎస్సైలు తాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, సిబ్బంది పావురాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తిరుమలగిరి(సాగర్), జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు సంబంధించి నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై సీపీఐ మండల నాయకులు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు ఉపాధి హామి పనుల్లో చోటు చేసుకుంటున్న అక్రమాలపై వివరింఆరు. రాజవరానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కప్పల సైదులు ఉపాధి హామీ పనులను గ్రామానికి దూరంగా చేపట్టి కూలీలను పని ప్రదేశానికి తరలించేందుకు తన సొంత ట్రాక్టర్‌ను వినియోగించి రవాణా చార్జీల నిమిత్తం రూ.200 వసూలు చేశాడని, రెండేళ్లుగా ఈ విధంగా సుమారు రూ.లక్ష వసూలు చేసినట్లు ఆరోపించారు. అదేవిధంగా కూలీలకు సరైన వేతనం ప్రతి వారం రూ.1800 వచ్చేలా చేయించేందుకు ఒక్కొక్కరి నుంచి రూ.200 వసూలు చేశాడని ఈ విషయంపై గ్రామస్థులు ఎందుకు ఇవ్వాలని అడగగా సంబంధిత టెక్నికల్ అసిస్టెంట్‌కు ఇస్తేనే సరిగా డబ్బులు వస్తాయని చెప్పినట్లు ఆరోపించారు. ఈ విధంగా రెండేళ్లుగా ఎఫ్ఏ, టీఏ కలిసి సుమారు రూ.3లక్షలను వసూలు చేసిన క్రమంలో వారిపై విచారణ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్ఎఫ్ఐ నాయకుడు ఎన్. జగదీష్, సీపీఎం నాయకులు షేక్ చాంద్‌పాషా, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో నీటి మోటారు చోరీ

కట్టంగూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కట్టంగూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి నీటి మోటారు చోరీకి గురైంది. పాఠశాల హెచ్‌ఎం, ఎంఈవో అంబటి అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం... పాఠశాలలోని నీటి ట్యాంకుకు, విద్యార్థులకు నీటి సరఫరా చేసే ట్యాంకులకు ఉపయోగపడే మోటారును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎంఈవో తెలిపారు.

దాతృత్వం


సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం మాజీ సర్పంచ్ అన్నెం శిరీష కొండారెడ్డి దాతృత్వం చాటుకున్నారు. మిట్టగూడెం నుంచి వచ్చి గ్రామంలోని ఆర్‌సీఎం పాఠశాలలో చదువుకుంటున్న 10 మంది పేద విద్యార్థులకు రూ.150లక్షలు విలువైన 20 సైకిళ్లు అందజేశారు. మాజీ జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. అన్నెం వెంకటరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో అనేక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌సీఎం పాఠశాల హెచ్‌ఎం ఉషా, పాదర్ అల్లం బాల్‌రెడ్డి, సారెడ్డి భాస్కర్‌రెడ్డి, రెక్కల శంభిరెడ్డి,హరిలీల, శ్రీనివాసరెడ్డి, భవాని శంకర్, వెంకటేశ్వర్లు, కోటిరెడ్డి, జ్యోతిరెడ్డి పాల్గొన్నారు.

● ఆంధ్రజ్యోతి, హుజూర్‌నగర్

ప్రోత్సాహం


వచ్చే పదో తరగతి వార్షిక పరీక్షల్లో 500 మార్కులు దాటిన విద్యార్థులకు రూ.10 వేల చొప్పున ప్రోత్సాహం అందజేస్తానని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీలింగోటం గ్రామానికి చెందిన తండ సైదులు ప్రకటించారు. తన తండ్రి యాదయ్య జ్ఞాపకార్థం స్థానిక జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు సోమవారం డిక్షనరీలు, నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెర్వుగట్టు దేవస్థానం మాజీ ధర్మకర్త గడ్డం పశుపతి, ఆర్. సత్యనారాయణ, డీ. భాస్కర్, ఆదిమళ్ల మణిరాజు పాల్గొన్నారు. చౌడంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ నోట్ బుక్స్ అందజేశారు.

● ఆంధ్రజ్యోతి, నార్కట్‌పల్లి.

ఆధార్ సేవాకేంద్రంలో చోరీ

● రూ.4లక్షల విలువైన సామాగ్రి అపహరణ


ఆధార్ సేవాకేంద్రంలో చిందరవందరగా పడిఉన్న సామాగ్రి

మిర్యాలగూడ అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఆధార్ సేవాకేంద్రంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. కేంద్రం నిర్వాహకులు, వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సెలవు కావడంతో ఆధార్ సేవా కేంద్రాన్ని శనివారం సాయంత్రం మూసి వేసి తన స్వగ్రామం వెంకటాద్రిపాలేనికి వెళ్లాడు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు కేంద్ర తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం కేంద్రం నిర్వాహకుడు తన ఆధార్ సేవా కేంద్రం వద్దకు వచ్చి చూడగా తలుపులు ధ్వంసమై ఉండడం, గదిలోని వస్తువులు చింతరవందరగా పడి ఉండడంతో వన్‌టౌన్ పోలీసులకు సమాచారమిచ్చాడు. అక్కడకు చేరుకున్న పోలీసులు చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కాగా కేంద్రంలోని 2ల్యాప్‌ట్యాప్‌లు, 2డెస్క్‌టాప్‌లు, 2 ప్రింటర్లు, మొబైల్, ఐరిష్. ఫింగర్‌ప్రింట్ డివైజర్లతోపాటు రూ.30వేల నగదును దొంగలు అపహరించినట్లు నిర్వాహకుడు తెలిపాడు. వీటితోపాటు డెస్క్‌లో ఉన్న ఆధార్ అప్‌డేషన్ పత్రాలు, పెద్దస్టాండ్ దొంగలు ఎత్తుకెళ్లినట్లు కేంద్రం నిర్వాహకుడు రమావత్ రాజా వాపోయాడు. చోరీకి గురైన సొత్తు విలువ సుమారు రూ.4లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు. కాగా నల్లగొండనుంచి క్లూస్ టీంను పోలీసులు రప్పించి వెలిముద్రలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ మోతీరాం తెలిపారు.

గుడ్లు చోరీ... ఆమ్లెట్ తినేసి పరారీ

ఆత్మకూరు(ఎస్), జూలై 7(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతం ప్యాకెట్లు, గుడ్లు, నూనె ప్యాకెట్లు చోరీచేసిన దొంగలు ఆమ్లెట్ వేసుకుని తిని మరీ వెళ్లిపోయారు. సోమవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్ అంగన్‌వాడీ రెండవ కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. అంగన్‌వాడీ టీచర్ రేపాక పద్మ తెలిపిన వివరాల ప్రకారం నెమ్మికల్ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలోని బీరువాలో కోడిగుడ్లు, బాలమృతం ప్యాకెట్లు, నూనె ప్యాకెట్లను ఉంచి శనివారం సాయంత్రం తాళం వేసుకుని వెళ్లారు. ఆదివారం సెలవు కావడంతో తెరవలేదు. సోమవారం ఉదయం 8 గంటలకు కేంద్రాన్ని తెరిచేందుకు టీచర్ పద్మ, ఆయా భిక్షమమ్మ వెళ్లగా అప్పటికే తలుపులకు వేసిన తాళం పగులగొట్టి ఉంది. కేంద్రం లోపలికి వెళ్లి చూడగా సామాగ్రి చిందర వందరగా ఉంది. బీరువా తలుపులు రాడ్లతో తీసి 5 నూనె ప్యాకెట్లు, 4 బాలామృతం ప్యాకెట్లు, రెండు కోడిగుడ్ల ట్రేలు చోరీ చేసినట్లు గుర్తించారు. కొన్ని గుడ్లు పగిలి ఉండటం, అక్కడి గ్యాస్ స్టవ్ వద్ద మూడు గుడ్లతో ఆమ్లెట్ వేసిన ఆనవాళ్లు కనిపించాయి. ఇదే విషయమై ఉన్నతాధికారులకు తెలియజేయడంతో సూపర్‌వైజర్ అన్నపూర్ణ కేంద్రాన్ని పరిశీలించారు. సుమారు రూ.1200 విలువైన సామగ్రి పోయిందని అంగన్‌వాడీ టీచర్ పద్మ ఇచ్చిన ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఆస్తి కోసం వేధిస్తోంది

● కుమార్తెపై ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన తల్లి
● సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో ఘటన

గరిడేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం కూతురు తల్లిదండ్రులను వేధిస్తున్న సంఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో జరిగింది. మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన కోల నాగమ్మ సోమవారం హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేసింది. గ్రామానికి చెందిన కోల నాగమ్మ, వెంకన్న దంపతులకు ముగ్గురు సంతానం. అందులో పెద్ద కూతురు సోమేశ్వరిని మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన నక్క రమేష్‌తో 10సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వివాహ సమయంలో తల్లిదండ్రులు కట్నంగా సోమేశ్వరికి 30గుంటల వ్యవసాయ భూమి, బంగారం, వారి స్థోమతకు తగిన విధంగా ఇచ్చి పెళ్లి చేశారు. వివాహమైన ఐదు సంవత్సరాల తర్వాత సోమేశ్వరికి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి అదనంగా ఎకరం భూమి కావాలని ఒత్తిడి చేస్తున్నట్లు తల్లి కోల నాగమ్మ తెలిపారు. ఇంకా ఇద్దరు పిల్లలు ఉన్నారు, నీకు అదనంగా ఎకరం ఇచ్చి మిగతా వారికి ఏమి ఇవ్వాలి, మాకు కుటుంబ పోషణ ఎలా అని తల్లిదండ్రులు సోమేశ్వరికి చెప్పారు. అయినా తన కూతురు వినకుండా తన అత్తగారి ఇంటి వాళ్లను తీసుకొచ్చి అక్రమంగా పొలం సేద్యం చేయడం, బెదిరిస్తున్నారని నాగమ్మ ఆరోపించింది. అంతేకాకుండా కూతురు తండ్రికి పింఛన్ రాకుండా చేసిందని నాగమ్మ ఆరోపించింది. కష్టపడి చదివిస్తే ఉద్యోగం వచ్చిన తర్వాత తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటూ వారి బాగోగులు చూసుకోవాల్సిన కూతురే ఇలా ఆస్తి కోసం వేధిస్తోందని తమ కుటుంబానికి రక్షణ కావాలంటూ ఆర్డీవోను వేడుకున్నట్లు తల్లి నాగమ్మ తెలిపారు.

ఆలయ హుండీ ధ్వంసం.. నగదు అపహరణ

భువనగిరి రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం నమాత్‌పల్లి శివారులో గల పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హుండీ ధ్వంసం చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని ధ్వంసం చేసి అందులో సుమారు రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఆలయ సిబ్బంది గుడి తలుపులు తెరిచి చూడగా హుండీ ధ్వంసమై ఉన్నట్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, ఎస్ఐ అనిల్ కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు.

కలెక్టరేట్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

● యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ ప్రజావాణిలో ఘటన ● భూమి సెటిల్‌మెంట్ చేసుకోవాలని అధికారులు వేధిస్తున్నారని ఆరోపణ


ఒంటిపై పెట్రోల్ పోసుకొని ప్రజావాణిలోకి వచ్చిన రైతు ఆగిరెడ్డి

భువనగిరి(కలెక్టరేట్), జూలై 7(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం తహసీల్దార్, ఆర్ఐ తనను భూమి సెటిల్‌మెంట్ చేసుకోవాలని వేధిస్తున్నారని ఆరోపిస్తూ ఓ రైతు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. హైదరాబాద్‌కు చెందిన తడకపల్లి ఆగిరెడ్డి 2005లో యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలోని నాగినేనిపల్లి రెవెన్యూ పరిధిలో ఎ. 2.20 గుంటల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి సాగు చేస్తున్నాడు. 2014లో తన పేరును తొలగించి అక్రమంగా మహిపాల్‌రెడ్డి పేరును రెవెన్యూ అధికారులు నమోదు చేశారని ఆరోపించాడు. ఒంటిపై పెట్రోల్ పోసుకొని కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన కలెక్టర్ హనుమంతరావు ఎదుట ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే అక్కడున్న భద్రతా సిబ్బంది గమనించి ఆయనను వారించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ ఆగిరెడ్డి సమస్యపై బొమ్మలరామారం తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భూభారతి చట్టం ప్రకారం గత వారం ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించినా ఎందుకు పరిష్కరించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల భూసమస్యలను పరిష్కరించడానికే భూభారతి చట్టమని ఆగస్టు 15వ తేదీలోగా జిల్లాలో రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అన్ని దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. అనంతరం రైతు ఆగిరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ నాగినేనిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 340లో 25 గుంటలు, 345లో 3 గుంటలు, 346లో ఎ 1. 32 గుంటల భూమిని తాను 2005లో కొనుగోలు చేశానని తెలిపాడు. 2014లో రెవెన్యూ అధికారులు మహిపాల్ రెడ్డి పేరున అక్రమంగా నమోదు చేశారని, అప్పటి నుంచి ఎన్నిసార్లు అధికారులకు దరఖాస్తు చేసినా ఫలితం లేకపోవడంతో ఆత్మహత్యాయత్నం చేశానని తెలిపాడు. బొమ్మలరామారం తహసీల్దార్, ఆర్ఐ మహిపాల్‌రెడ్డితో సెటిల్‌మెంట్ చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించాడు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసేవరకు పోరాటం

మిర్యాలగూడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కార్మికుల హక్కుల చట్టాలకు వ్యతిరేకంగా తీసుకు వచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేసేంత వరకు ఉద్యమిస్తామని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్ అన్నారు. పట్టణంలోని సీఐటీయూ భవన్‌లో 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం నిర్వహించిన అఖిల పక్ష కార్మిక సంఘాల స మావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నూతనంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించా రు. కార్మికుల శ్రమను దోపిడీచేసే కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను తీసుకువచ్చారని ఆరోపించారు. ఈ నెల 9న జరిగే సార్వత్రిక సమ్మెకు సంఘటిత, అసంఘటిత రంగాలలోని కార్మికులు స్వచ్ఛందంగా మద్దతు తె లిపి ఉత్పత్తి, రవాణా రంగాన్ని స్తంభింపచేసి ప్రభుత్వానికి తీవ్ర నిరసన తెలియజేయాలని కోరారు. సమావేశంలో వ్యకాస రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, హమాలీ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు తిరుపతి రాం మూర్తి, సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు సయీద్ తదితరులు ఉన్నారు.

భూ నిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

దామరచర్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ విద్యుత్ పరిశ్రమ నిర్మాణంలో భాగంగా భూములను కోల్పోయిన భూనిర్వాసితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. వీర్లపాలెం గ్రామ పరిధిలో పరిశ్రమ నిర్మాణానికి భూములు ఇచ్చిన తాళ్లవీరప్పగూడెం గ్రామ రైతులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో విద్యుత్ పరిశ్రమ నిర్మాణ సమయంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నానని, ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాది కల్పనతోపాటు ఈ ప్రాంత అభివృద్ధికి యుద్ధప్రాతిపదికన నిరంతరాయంగా భూసేకరణ ప్రక్రియ చేపట్టి రైతులను ఒప్పించి సాగు భూములను పరిశ్రమ కోసం ఇప్పించినట్లు తెలిపారు ప్రస్తుత ప్రభుత్వం కొద్దిమందికి మాత్రమే ఉద్యోగాలు కల్పించి పట్టించుకోడం లేదన్నారు. ఈ విషయమై సీఎం, డిప్యూటీ సీఎంను కలిసి విన్నవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గంపూడి నారాయణరెడ్డి, యూసుఫ్, అంగోతు హాతీరాంనాయక్, కటికం సైదులురెడ్డి, సోము సైదిరెడ్డి, దారగాని వెంకటేశ్వర్లు, కొనకంచి సత్యనారాయణ, నర్సయ్య, సైదయ్య ఉన్నారు.

సంకల్పం కదిలించింది



కాల్వలో ఏరిన చెత్తను ట్రాక్టర్ వద్దకు తీసుకెళ్తున్న యువకులు

రేపటి కోసం శ్రమిద్దాం..

చెత్త తీసుకెళ్తున్న యువతి

నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉదయ సముద్రం కాల్వలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో తొలగించేందుకు యువతీయువకులు నడుం బిగించారు. గన్‌రెడ్డి సూర్యవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా శ్రమదానం చేసి చెత్త తొలగించి శుభ్రం చేశారు.

● స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ నల్లగొండ




కాల్వలో చెత్త, చెదారం ఏరుతున్న యువకులు


కాల్వలో చెత్త సేకరిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

మంద కృష్ణమాదిగ కృషి ఫలితమే వర్గీకరణ



శాలిగౌరారంలో జెండా ఎగురవేస్తున్న నరేష్

శాలిగౌరారం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వర్గీకరణ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కృషి ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ అన్నారు. ఎమ్మార్పీఎస్ 31 ఆవిర్భావ దినం నల్లగొండ జిల్లా శాలిగౌరారంలో సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 31 ఏళ్ల ఉద్యమ ప్రస్థానంలో మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో సాధించిన విజయాల గురించి ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బట్ట చిన సైదులు, బట్ట సైదులు, బట్ట శ్రీను, తాటిపాముల జానయ్య , చింత ధనంజయ, వేముల గోపినాథ్, బట్ట నరసింహ, తాటిపాముల సైదులు, బట్ట లక్ష్మీనారాయణ, కారుపాటి అంబేడ్కర్, బాకీ వెంకన్న, అరవింద్ పాల్గొన్నారు.

పలు సిమెంట్ కంపెనీలకు ఫైవ్‌స్టార్ రేటింగ్

మఠంపల్లి, మేళ్లచెర్వు: జూలై 7(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల పరిధిలోని సాగర్ సిమెంట్స్ పరిశ్రమకు మైనింగ్ విభాగంలో ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డు దక్కింది. దీంతో పరిశ్రమకు వరుసగా మూడోసారి లభించింది. జైపూర్ పట్టణంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి నుంచి పరిశ్రమ యాజమాన్యం తరుపున సమ్మిడి సిద్ధారెడ్డి అవార్డు అందుకున్నారు. ఫైస్టార్ రేటింగ్ అవార్డులను మేళ్లచెర్వు మండల కేంద్రంలోని మైహోం సిమెంట్స్ సంస్థకు, మండల పరిధిలోని రామాపురం గ్రామంలోని రెయిన్ సిమెంట్ సంస్థకు అవార్డులు దక్కాయి. కార్యక్రమంలో మైహోం మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి రంజిత్‌రావు, యూనిట్ హెడ్ ఎం.శ్రీనివాసరావు, ఈ అవార్డులు అందుకోగా రెయిన్ సిమెంట్ ప్రతినిధులు ఎ.సీతారామిరెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

మిర్యాలగూడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): కౌలురైతులకు గుర్తింపుకార్డులు ఇచ్చి రుణ సదుపాయం కల్పించాలని ఆలిండియా కిసాన్ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కమిటీ పిలుమేరకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీప్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయాలని అన్నారు. రైతు భరోసా, రైతు బీమా వర్తింపజేయాలన్నారు. పంటల వారిగా సమగ్ర వ్యవసాయ ప్రణాళిక ప్రకటించి కార్యాచరణ చేపట్టాలన్నారు. భూ సమస్యలను పరిష్కారించాలని కోరారు. పోడు రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని అన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌డిడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, నాయకులు కాశీ, జ్యోతి, కిరణ్, మౌనిక, గురవయ్య, సైదులు, ఇమ్మానియేల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీయూఈటీలో సత్తాచాటిన కేఎన్ఎం విద్యార్థి



మిర్యాలగూడ టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కేశబోయిన శ్రీహరి కామన్ సెంట్రల్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(పీజీ)లో సత్తా చాటాడు. కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీఎస్) డిగ్రీ పూర్తి చేసిన శ్రీహరి జాతీయస్థాయిలో నిర్వహించే సీయూఈజీ టెస్ట్‌లో అత్యత్తమ ర్యాంకులతో అలరించాడు. ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీలో 9వ ర్యాంకు, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్నాటకలో 14వ ర్యాంకు సాధించాడు. అంతేగాక హిమాచల్‌ప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీలో 4వ (ఓబీసీ విభాగం)లో ర్యాంకు సాధించిన శ్రీహరి పాండచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో 83వ ర్యాంకు సాధించి కేఎన్ఎం కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చాడు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ చిన్నతనం నుంచే మ్యాథ్స్ అంటే మక్కువ ఉండేదని, డిగ్రీలో కేఎన్ఎం కళాశాల గణిత అధ్యాపకులు ప్రోత్సాహంతో ఆ సబ్జెక్టుపై పట్టు సాధించానన్నారు. మ్యాథ్స్ లెక్చరర్‌గా విద్యార్థులకు సేవలందించడమే తన లక్ష్యమన్నారు. పేరొందిన సెంట్రల్ యూనివర్సిటీలలో అడ్మిషన్ వచ్చినప్పటికీ కర్నాటక సెంట్రల్ యూనివర్సిటీలో చేరుతానన్నాడు. తనను ప్రోత్సహించిన గురువులందరికీ కృతజ్ఞతలు తెలిపాడు. కాగా శ్రీహరి అత్యుత్తమ ర్యాంకులు సాధించడం పట్ల కేఎన్ఎం కళాశాల మ్యాథ్స్ హెచ్‌ఓడీ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఐసెట్ ఫలితాలు విడుదల

- జిల్లా వాసికి రాష్ట్ర 8వ ర్యాంకు



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి తదితరులు

నల్లగొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహించిన ఐసెట్ ఫలితాలు సోమవారం నాడు విడుదల అయ్యాయి. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి, ఐసెట్ చైర్మన్, ఎంజీయు వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవితో కలిసి ఫలితాలు విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 38, 754మంది విద్యార్థులకు గాను 32, 106మమంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 30,944మంది ఉత్తీర్ణతతో ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. నల్లగొండ పట్టణానికి చెందిన వ డ్డేపల్లి శ్రీనివాస్ రాష్ట్రంలో 8వ (148.17) ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఆయనను అధ్యాపకులతో పాటు కుటుంబ సభ్యులు బంధువులు అభినందించారు.

పద్మపురోహితులు సంఘటితం కావాలి

- పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షుడు రుద్ర పాండురంగశాస్త్రి


పద్మపురోహిత సంఘం జిల్లా సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగశాస్త్రి

భూదాన్‌పోచంపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పద్మపురోహిత సంఘం సభ్యుల సమస్యల పరిష్కారంకోసం సంఘటితం కావాలని తెలంగాణ రాష్ట్ర పద్మబ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు రుద్ర పాండురంగశాస్త్రి అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో పద్మ పురోహిత సంఘం జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకుల సమక్షంలో జిల్లా నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన రుద్ర పాండురంగశాస్త్రితోపాటు గడ్డం మల్లికార్జున హాజరు కాగా, జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు డాక్టర్ సీత సత్యనారాయణ, పద్మపురోహిత సంఘం రాష్ట్ర నాయకులు అవురేణి కృష్ణశాస్త్రి, బోగ మహేష్, మేకల నరేందర్, దోర్నాల కృష్ణపంతులు, వర్కాల శ్రీహరి పాల్గొన్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కర్నాటి నరేందర్, ఉపాధ్యక్షులుగా కొలను నరేందర్, చెరుపల్లి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా ఆయిటిపాముల బీమయ్య ఎన్నికయ్యారు.

గిరిజనుల సీత్లా సంబరం

- ప్రకృతిని పూజించే సీత్లా భవాని పండుగ
- పశు సంపదను రక్షించాలని అమ్మవారికి పూజలు
- పిల్లపాపలు,పాడి పంటలు బాగుండాలని మొక్కులు


బోనాలతో తరలివెళ్తున్న మహిళలు, యువతులు(ఫైల్)

బంజారాల సీత్లా పండుగ ప్రకృతిని ఆరాధించే సంప్రదాయ పండుగ. ఇది ఆషాడ మాసంలో తొలకరి విత్తనాలు వేసిన తర్వాత జరుపుకుంటారు. ఈ పండుగను సీత్లా భవాని లేదా దాటుడు పండుగ అని కూడా పిలుస్తారు. ఈ పండుగలో గిరిజనులు సీత్లా మాతను పూజిస్తారు. ఆమె తమను, పశుసందను, పంటలు కాపాడుతుందని వారి నమ్మకం.

- మఠంపల్లి, ఆంధ్రజ్యోతి

పూర్వ కాలంలో బంజారా లంబాడీ ప్రజలు అటవీ ప్రాంతంలో జీవిస్తూ పశువులను మేపుతూ, అటవీ భూములను సాగుచేస్తూ కుటుంబాలను పోషించుకుంటూ జీవనం సాగించేవారు. వీరి వద్ద పెద్ద సంఖ్యలో గోవులు, బర్రెలు, మేకలు, గొర్రెలు ఉండేవి. ఆవుల పాలతో నెయ్యి తయారు చేసి వారం వారం జరిగే సంతలో విక్రయించేవారు. పశువుల పేడను పంట భూములకు ఎరువులుగా ఉపయోగించేవారు. కాలక్రమేణా వీరి పశువులు తరుచూ పలు రకాల వ్యాధులు సోకి రోగాల బారిన పడుతూ వందల సంఖ్యలో మరణాలు సంభవించేవి. తండాల్లో ఉన్న పశువులు రోగాలతో రోజూ మృత్యువాత పడడంతో తండాల్లోని పశువుల సంఖ్య గణనీయంగా తగ్గుతుండేది. అధికారిక పేరు(లంబాడీ సుగాలీ) సీత్లా పండుగ ఇతర పేర్లతో దాటుడు పండుగ, పశువుల పండుగ ఆషాడమాసం, పెద్ద పూసా కార్తీలో జరుపుకునే రోజు. ఆషాడ మాసం జూలై నెలలోని(మొదటి లేదా రెండో) మంగళవారం ఒక రోజు తండా పెద్దాయనకు రాత్రి కలలో ఏడుగురు దేవతలు (సాత్ భవాని) ప్రత్యక్షమయ్యారు. అందులో చిన్న దేవత సీత్లా భవాని ప్రత్యేకించి ఆ పెద్దాయనతో మాట్లాడి తనను తండా సమీప ప్రాంతంలో చెరువు ఒడ్డున ఒక చెట్టుకింద ఏడుగురు దేవతలను ప్రతిష్ఠించి పూజించి జంతుబలి ఇచ్చి మొక్కులు తీరిస్తే పశువులను రక్షిస్తానని, మీరు కోరుకున్న కోరికలు నేరవేరుతాయని చెప్పడంతో ఆ తండా పెద్దాయన సీత్ల భవాని కలలోచెప్పిన విషయాలను తండా నాయక్‌కు చెప్పడంతో నాయక్(కార్భారి) ఆధ్వర్యంలో తండా ప్రజలందరిని కూర్చోబెట్టి జరిగిన సంఘటనను అందరికీ వివరించడంతో సీత్లతల్లి చెప్పిన విధంగా పండుగ చేయడం మొదలుపెట్టారు.

ఏడుగురు దేవతలు

ఏడుగురు దేవతల్లో సీత్లా భవాని ఒకరు. తండాలో ఏ కార్యం జరిగినా పెళ్లిళ్లు, పుట్టుకలు, చావులు, పండుగలు అయినా సాముహికంగా తండా పెద్దనాయక్ ఆధ్వర్యంలో జరుపుకుంటారు. ఏడుగురు దేవతలను పూజిస్తారు. సీత్లా భవాని పండుగను ఊరి పొలిమేరలో పశువులతో జరుపుకుంటారు. మేరమ్మయాడీ, త్వల్జా(త్వళ్జ), అంబా భవాని, హింగ్లా, ద్వాళాంగర్, కంకళీ, సీత్లా భవాని దేవతలతో పాటు ముందు భాగంలో లుకద్యా దేవుడిని ప్రతిష్ఠించి పూజలు చేసి నైవేద్యాలు సమర్పిస్తారు.

పండుగ జరిపే విధానం

ఈ పండుగ పంట పొలాలలు సాగుచేసే ప్రారంభంలో ప్రారంభమవుతుంది. దీనిని ఆషాడ మాసంలో ఒక మంగళవారం నిర్వహించడం ఆనవాయితీ. తండాల సరిహద్దు పొలి మేర, కూడలి వద్ద సీత్లాతల్లిని ప్రతిష్ఠిస్తారు. పురుషులంతా డప్పు వాయిద్యాలు వాయిస్తూ కోళ్లు, మేకలు, గొర్రెలను బలి ఇస్తారు. మహిళలు, యువతులు బోనాలు ఎత్తుకొని నృత్యాలు చేసుకుంటూ అమ్మవారిని సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

అమ్మవారికి నైవేద్యంగా గుగిళ్లు(ముగ్రీ) పాయసం(లాప్సీ) తయారు తయారు చేసి సమర్పిస్తారు. కోళ్లు, మేకలు, గొర్రెలను బలిఇచ్చి వాటిపై నుంచి పశువులను దాటిస్తారు. అలా చేయడం వల్ల

సీత్లా పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించాలి



పండుగ సీత్లా భవాని పండుగను ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించాలి. లంబాడీలు వారి సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ. ఇటువంటి పండుగ తెలుగు పండుగళ్లలో లేదు. ఈ పండుగ బంజారా ఔన్నత్యాన్ని చాటుతూ ఆషాడమాసంలో ఒక మంగళవారం నిర్వహిస్తారు. ఇది ప్రతీ సంవత్సరం మంగళవారం రోజే నిర్వహించడం అనవాయితీ.

- బానోతు చంద్రునాయక్, గ్రామ పెద్దనాయక్

తల్లి దీవెనలు తండాపై ఉండాలని



సీత్లా భవాని వేడుకలను పూర్వకాలం నుంచి పూజిస్తున్నాం. తల్లి దీవెనలు తండా ప్రజలపై, పశు సంపదపై ఉండాలనే నమ్మకంతో ప్రతి ఏటా కోళ్లు, మేకలు, గొర్రెలను బలిదానం చేసి మొక్కులు చెల్లించుకుంటున్నాం. ఏడుగురు దేవత దీవెనలు ఎప్పుడూ ఉండాలని భక్తి శ్రద్ధలతో గిరిజన సంప్రదాయలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్నాం.

- రమావత్ లచ్చిరాంనాయక్, గ్రామ పెద్ద


పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని గిరిజనుల నమ్మకం.

యాదగిరిగుట్టలో శివకేశవులకు విశేష పూజలు


గర్భాలయంలో కవచమూర్తులను దర్శించుకున్న త్రిదండీ రామచంద్ర జీయర్ స్వామిజీ

యాదగిరిగుట్ట, జూలై 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామి అమ్మవారికి వైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. సాయంత్రం వేళ అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు ఆగమశాస్త్రరీతిలో కొనసాగాయి. శివాలయ ముఖమండపంలో స్పటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. చతుర్మాసం ప్రారంభంలో లక్ష్మీ నరసింహులను దర్శించుకోవడం మోక్షమార్గం కలుగుతుందని త్రిదండీ రామచంద్ర జీయర్‌స్వామి ప్రవచించారు. స్వామివారిని దర్శించుకునేందుకు సోమవారం యాదగిరిగుట్టకు వచ్చారు. ఆయన వెంట ఏఈవో జూశెట్టి క్రిష్ణ, ఉప ప్రధానార్చకుడు కే. మాధవచార్యులు, పర్యవేక్షకులు మాచర్ల రాజన్‌బాబు, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శివకేశవుల ఆలయాల్లో హరిహరులకు విశేష అర్చనలు జరిగాయి. ఉదయం స్వామికి పంచసూక్త విధానంగా అభిషేకాలు చేపట్టాక ఆరె పత్రితో అష్టోత్తర నామార్చనలు, అర్జిత సేవలు నిర్వహించారు. మహాక్షేత్రంలో భక్తుల ఆధ్వర్యంలో నిత్యకల్యాణం శాస్రోక్తంగా జరిపించి దివ్యమూర్తులను ఆలయ ప్రదక్షిణం చేయించారు. క్షేత్రానికి వచ్చిన భక్తులు కృష్ణానదీ స్నానాలు ఆచరించి ఈశ్వరునికి, స్వయంభువుడికి జరిగిన అభిషేకాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండనవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థికి రజత పతకం

సూర్యాపేటరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): హనుమకొండలో ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి ట్రయాథ్లాన్ అండర్-14, 10, 12 సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో సూర్యాపేట జిల్లా పిల్లలమర్రి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి భోగ రాజు హరినాథ్ రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్‌లో రాణించి రజత పతకం సాధించినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం పిల్లలమర్రి హరినాథ్, కోచ్ చెరుకు వెంకటేష్‌ను ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

అందరికీ సమాన విద్య అందించాలి

నల్లగొండ రూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి) : అందిరకీ సమాన విద్యావకాశాలు కల్పించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున డిమాండ్‌చేశారు. సోమవారం సోషల్ వెల్ఫేర్ కార్యాలయం ముందు జిల్లాలో బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులతో కలిసీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ అన్ని వసతులు సౌకర్యాలు అందరికి సమాన విద్య అందించాలని డిమాండ్ చేశారు. డాన్ బోస్కో లాంటి స్కూల్లో విద్యార్థులకు యూనిఫారం ఇవ్వబోమని అనడం అన్యాయమని వెంటనే యూనిఫామ్ షూ అందించాలని కోరారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ విద్యార్థులకు జిల్లాలో నాణ్యమైన విద్య అందించాలని జిల్లా అధికారులు పర్యవేక్షణ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. సరైన బుక్స్ ఇవ్వకుండా దళిత విద్యార్థులను ఒంటరిగా కూర్చోబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. పేరెంట్స్ తో కలిసి ధర్నా అనంతరం డిడి సోషల్ వెల్ఫేర్ అధికారి శశికలకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ స్కూళ్లలో దళిత విద్యార్థులకు ఉన్నత విద్య చదివించాలనే లక్ష్యం బూడిదలో పోసిన పన్నీరు లాగా మారుతోందని పెండింగ్ బిల్లులు రావడంలేదని ఉద్దేశంతో ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లితండ్రులు బండారు శంకర్, కత్తుల శివ, టి.రవితేజ రాజు, నరసింహ పాల్గొన్నారు.

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో స్వల్ప ప్రమాదం

యాదగిరిగుట్ట రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూర్ ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో సోమవారం స్వల్ప ప్రమాదం జరిగింది. మధ్యాహ్న సమయంలో మూడో నెంబర్ యూనిట్‌లో రసాయనిక పదార్థాలు మిక్సింగ్ చేసి, డ్రై చేస్తున్న సమయంలో స్వల్ప మంటలు చెలరేగాయి. దీంతో విధులు నిర్వహిస్తున్న గుట్ట మండలం తాళ్లగూడెం గ్రామానికి చెందిన గుజ్జ బాల్‌రాజ్‌కు చేతులు, ముఖంపై గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భువనగిరి కస్తూరి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణాపాయం లేదని యాజమాన్య వర్గాల ద్వారా తెలిసింది. ఆ సమయంలో విధులు పరిశీలించడానికి వెళ్లిన మహిళా అధికారి వట్టిపల్లి సుమలత మంటల వేడికి స్వల్ప అస్వస్థతకు గురికావడంతో భువనగిరి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భవనంలో మొత్తం ఏడుగురు కార్మికులు వేర్వేరు గదుల్లో విధులు నిర్వహిస్తుండగా వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదని కంపెనీ మేనేజర్ హెచ్ఆర్ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

అర్హులందరికీ చేనేత భరోసా ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్

నల్లగొండ రూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి) : జియో ట్యాగ్ నెంబర్ ఉన్న ప్రతి మగ్గంపై పనిచేస్తున్న చేనేత కార్మికులందరికీ చేనేత భరోసా కల్పించాలని, చేనేత రుణమాఫీలో నిబంధనలు సడలించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ చేనేత కార్మిక సంఘం నల్లగొండ జిల్లా విస్తృత సమావేశం దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా మురళీధర్ మాట్లాడుతూ చేనేత కార్మికుల మగ్గాలకు జియో ట్యాగ్ నెంబరు వేశారని, ప్రతీ నెంబర్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన చేనేత భరోసా చేనేత కార్మికుడికి రూ.18,000, అనుబంధ వృత్తులు చేసే కార్మికులకు రూ. 6000 వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత రుణమాఫీలో లక్షకు పైగా రుణమున్న చేనేత కార్మికుడిని పైన ఉన్న డబ్బులు కడితేనే రుణమాఫీ వర్తిస్తుందని అధికారులు అంటున్నారని ఇది సరైనది కాదని అన్నారు. ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రతి చేనేత కార్మికుడికి లక్ష రూపాయలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఏర్పాటుచేసిన పవర్లూమ్ యారన్ డిపో మాదిరిగా చేనేత కార్మికుల కోసం ఉమ్మడి నలగొండ జిల్లా లో చేనేత యారన్ డిపో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు స్టాండ్ మగ్గాలు ఇవ్వాలని అన్నారు. తక్షణమే చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి, రాష్ట్ర టెస్కోకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన పేద చేనేత కార్మికులకు ఇండ్లు, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్లు ,అంతోదయ కార్డులు ఇవ్వాలని కోరారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కర్నాటి వెంకటేశం, గంజి నాగరాజు, కర్నాటి శ్రీరంగం, గడ్డం దశరథ, రాపోలు వెంకన్న, మిరియాల శ్రీవాణి, ఏలే శ్రీనివాస్, గంజి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పేరు మారిస్తే చర్యలు మాఫీ?

- ప్రైవేట్ ఆస్పత్రులపై నిఘా..పర్యవేక్షణ లోపం
- అమ్మ కడుపులోనే కన్నుమూస్తున్న ఆడ శిశువులు



భువనగిరి టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు ఉల్లంఘించి పట్టుబడిన ల్యాబ్‌లు, ఆసుపత్రులు పేరు మార్చుకుంటే చర్యలు మాఫీ అన్నట్లుగా మారింది. అవే భవనాలు, ఆరోపణలు ఎదుర్కొన్న ఆ వైద్యులే, ఆ సిబ్బందే కొత్త పేర్లతో ఆసుపత్రులను, ల్యాబ్‌లను లాభాపేక్ష ధోరణితో నిర్వహిస్తూ దారుణాలు సాగిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లపై వైద్య, పోలీస్ శాఖల పర్యవేక్షణ, నిఘా లోపంతో అమ్మ కడుపులోనే ఆడ శిశువులు భ్రూణహత్యకు గురవుతున్నారు. ఆడ పిల్లంటే ఆర్థిక భారం అనే భావనకు తోడు.. ఈ కాన్పులోనైనా కొడుకు కావాలనే తల్లిదండ్రుల ఆశల కారణంగా బాహ్య ప్రపంచాన్ని చూడక ముందే ఆడ శిశువును శాశ్వతంగా కన్నుమూస్తున్నారు. ఈ తరహా వెలుగు చూస్తున్న అమానుషాలు కొన్నైతే చీకటిలో మగ్గిపోతున్నవే అధికమని పలువురు వాపోతున్నారు. ఈ క్రమంలో భువనగిరిలో ఒకే ఆస్పత్రిలో ఒకే రోజున ఏకకాలంలో అర్హత లేని వైద్య దంపతులు రెండు అబార్షన్లు చేయడంతో ఇద్దరు ఆడ శిశువలు కన్నుమూసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. ల్యాబ్ యజమాని ఒక్కో లింగ నిర్ధారణ పరీక్షకు రూ.16వేలు, ఒక్కో అబార్షన్‌కు ఆసుపత్రి నిర్వాహకులు రూ.30వేలు ముందస్తు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ ఇంకా అధిక మొత్తంలోనే ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

అయితే ఈ తరహా లింగ నిర్ధారణ పరీక్షలు అబార్షన్లు జిల్లా కేంద్రం భువనగిరితో పాటు ఇతర ప్రాంతాల్లోని పలు ఆసుపత్రులు, ల్యాబ్‌లలో నిరంతరాయంగా సాగుతున్నాయని ఐఎంఏ ప్రతినిధులే అంతర్గతంగా మాట్లాడుకుంటుండడం, ఆడపిల్లపై వివక్ష భ్రూణ హత్యల తీవ్రతను తెలియజేస్తోంది. ఇలాంటి సంఘనలు వెలుగు చూసిన ప్రతీ సందర్భంలో నోటీసులు, తనిఖీల పేరిట అధికారులు హడావుడి చేసి అనంతరం గుర్తుతెలియని కారణాలతో గుప్తంగా ఉండిపోతుండడం పరిపాటిగా మారుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటీవలే జిల్లాలోని 41స్కానింగ్ సెంటర్లు, పలు ఆసుపత్రుల్లో తనిఖీలు చేసిన అధికారులు 35 స్కానింగ్ సెంటర్లను నోటీసులు ఇచ్చి తదుపరి చర్యలను విస్మరించినట్లు ఆరోపణలున్నాయి.

పేరు ఎలా మారిందంటే..?

భువనగిరిలో అక్రమ పర్వం వెలుగు చూసిన గాయత్రి ఆప్పత్రి అసలు పేరు స్వాతి హాస్పటల్. కానీ అర్హత లేని ఆసుపత్రి నిర్వాహకులు వైద్య చికిత్సలతో ఇద్దరు మహిళలు మృతి చెందటం, అబార్షన్ల ఘటనలు వెలుగు చూడటంతో అప్పటి అధికారులు ఆ ఆసుపత్రి అనుమతులను రద్దు చేశారు. కానీ ఆ వెంటనే గాయత్రి ఆసుపత్రి పేరిట అధికారులు తిరిగి అనుమతులు ఇవ్వడంతో అదే అక్రమ తంతును యథావిధిగా కొనసాగిస్తున్నారు. తుర్కపల్లి, చౌటుప్పల్, తదితర మండలాల్లోని పలు ల్యాబ్‌లు, ఆసుపత్రులు కూడా రూపాంతరం చెందిన యథావిధిగా లింగనిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలను సాగిస్తున్నట్లు ప్రచారం. అయితే మెజార్టీ ఆసుపత్రులు, ల్యాబ్‌లు కూడా రహస్యంగా ఈ తంతును కొనసాగిస్తున్నాయని, ఇందుకు పలువురు గ్రామీణ వైద్యులు మధ్యవర్తులుగా ఉంటూ తప్పుడు మార్గం ఎంచుకుంటున్న దంపతుల ఆర్థిక స్తోమత, సామాజిక హోదా ఆధారంగా చార్జీలను నిర్ణయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలున్నాయి. ఇందుకు కొద్ది మంది వైద్య ఆరోగ్య శాఖ అధికారులులోపాయకారిగా సహకరిస్తూ కాపాడుతున్నారని, ప్రతిఫలంగా భారీ ముడుపులు పొందుతున్నారని సహచర ఉద్యోగులే ఆరోపిస్తున్న పరిస్థితి. ఈ మేరకు ఆ శాఖ ఉద్యోగుల మధ్య ఇటీవల జరిగిన కుమ్ములాటలే నిదర్శనమని పలువురు అంటున్నారు. అయితే నిబంధనలకు లోబడి లింగ నిర్ధారణ పరీక్షలకు, అబార్షన్లకు చట్టాలు అనుమతిస్తున్నాయి. కానీ ఆ చట్టాలు, నిబంధనలు పాటించిన సందర్భాలు, అమలు చేసే ఆలోచనలు, పర్యవేక్షించే ఓపిక నిర్వాహకులకు, అధికారులకు లేనే లేవని పలు సందర్భాలు నిరూపిస్తున్నాయి.

లింగనిర్ధారణ అబార్షన్లపై చట్టాలు, శిక్షలు ఇలా..

లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేసిన వారితో పాటు చేయించుకున్న మహిళలు, ప్రోత్సహించిన కుటుంబాలు కూడా శిక్షార్హులే. గర్భధారణ పూర్వ, గర్భస్త పిండ ప్రక్రియ (లింగ ఎంపిక నిషేధ) చట్టం 1994 ప్రకారం పుట్టబోయేది ఆడ బిడ్డా, మగ బిడ్డా అని అడుగుట, నిర్ధారించుట, చట్టరీత్యా నేరం, లింగనిర్ధారణ పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్నవారికి, ప్రోత్సహించిన వారికి చట్టం ప్రకారం 3 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.50వేల జరిమానా ఉంటుంది.

ఎంటీపీ యాక్ట్ ప్రకారం..

మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం (ఎంటీపీ యాక్ట్) స్కానింగ్‌కు, అబార్షన్లకు అనుమతి ఉంటుంది. అయితే ఇందుకు పలు నిబంధనలు పాటించాల్సి ఉం టుంది. అర్హులైన వైద్యులే నిర్వహించాల్సి ఉంటుంది. సాధారణ, సామాజిక ఆరోగ్య కారణాలు, గర్భనిరోధక జాగ్రత్తలు విఫలమైన పక్షంలో, తల్లి గర్భంలో శిశువు ఎదుగుదల, గర్భిణీ మానసిక, శారీరక ఆరోగ్యం ఆధారంగా ఎంటీపీ యాక్ట్‌ను అమలు చేయవచ్చేను ఇందు కు 20 వారాల లోపు గర్భిణికి రిజిస్ట్రర్డ్ వైద్యుడు 20 నుంచి 24 వారాల గర్భిణికి ఇద్దరు అర్హులైన వైద్యులు, 24 వారాల పైబడి గర్భిణికి వైద్య బోర్డు సలహా మే రకు స్కానింగ్ నిర్వహించి అబార్షన్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు ఎంబీబీఎస్ వైద్యులు కనీసం 6 నెలల పాటు గైనకాలజీ విభాగంలో ఇంటెర్న్షిప్ లేదా కనీసం ఒక సంవత్సరం ప్రాక్టీస్, లేదా 25 ఎంటీపి యాక్ట్ కేసుల బృందంలో సభ్యునిగా ఉండాల్సి ఉం టుంది. ప్రతి స్కానింగ్, అబార్షన్‌ను రికార్డు చేసి ప్రతి నెలకు డీఎంహెచ్‌వోకు సమర్పించాల్సి ఉంటుంది. ఇందు కోసం ఆయా ఆసుపత్రులు ముందుగానే ప్రత్యేక అనుమతులు పొందాల్సి ఉంటుంది. వైద్యాధికారులు నిరంతరం ఆ ఆసుపత్రులను తనిఖీ చేయాల్సి ఉంటుంది. కఠినతరమైన ఈ నిబంధనలను పాటించడం కష్టసాధ్యం కావడంతో ఆసుపత్రులు, ల్యాబ్ నిర్వాహకులు ఎంటీపీ యాక్ట్ బదులు రహస్య చర్యలకే ప్రాధాన్యం ఇస్తున్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

నకిరేకల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రాచకొండ వెంకట్‌గౌడ్ అన్నారు. పట్టణంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చీకటి ఒప్పందాలతో కార్మిక, కర్షకులను ఇబ్బందులు పెడుతుందన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ కార్యదర్శి వంటెపాక వెంకటేశ్వర్లు, వంటెపాక కృష్ణ, ఏర్పుల తాజేశ్వర్ పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి రూ.50లక్షలు

కట్టంగూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువుఅన్నారం గ్రామంలోని కోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకుడు నంద్యాల వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో దేవాదాయశాఖ సీజీఎఫ్ నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఆలయ నిర్మాణంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించకోనుందని పేర్కొన్నారు.

ఆపదలో ఉన్నాం.. ఆదుకోండి


ప్రజావాణి కార్యక్రమానికి విశేషస్పందన

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నాం ఆదుకోండి అంటూ జిల్లా నలుమూలల నుంచి అనేకమంది బాధితులు ఎన్నో ప్రయాసాలకోర్చి వారం వారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. వారిలో కొందరు వ్యక్తిగత సమస్యలపై రాగా మరికొందరు సామాజిక అంశాలపై తరలివచ్చి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి తమ బాధలను చెప్పుకున్నారు. కలెక్టర్ వారి వద్ద నుంచి వినతిపత్రం స్వీకరించి వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు లేఖలు రాశారు. ఈ వారం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 70 వరకు దరఖాస్తులు రాగా అందులో 23 జిల్లా అధికారులకు 47 వివిధ శాఖలకు రాశారు.



వినతిపత్రాలు స్వీకరించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


బిల్లు ఇప్పించండి



నేను మామూలు కాంట్రాక్టర్‌ను. మా గ్రామంలో నిర్మించిన అమ్మ ఆదర్శ పాఠశాలలో విద్యుత్‌కు సంబంధించిన కాంట్రాక్టు పనులను నిర్వహించాను. ఇందుకు సంబంధించి అత్యవసర పరిస్థితుల్లో నాకు నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించారు. పనులన్నింటినీ సకాలంలో పూర్తి చేశాను. ఏఈ ద్వారా ఎంబీ కూడా పూర్తి చేశాను. పనులు పూర్తి చేసి 15 నెలలు గడుస్తున్నా నేటికీ బిల్లులు రాలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అప్పులు తెచ్చి పనులు చేసినందున తెచ్చిన అప్పులకు వడ్డీలు అధికమవుతున్నాయి. దయచేసి బిల్లు ఇప్పించి ఆదుకోండి.

- నాగేశ్వర్‌రావు, ఎడవల్లి, కనగల్ మండలం


అర్హులకే పథకాలు అందించాలి



మండల పరిధిలోని ప్రజలు ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎకరాల కొద్ది భూములున్న వారికి ఇళ్లను కేటాయించారు. అదేవిధంగా రాజీవ్ యువవికాసం పథకం లో ఎంతో ఆశతో దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువతను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. దీనికి తోడు రైతు రుణమాఫీ, రైతు భరోసా విషయంలో కూడా సామాన్యులకు తీవ్రఅన్యాయం జరుగుతుందని తెలిపారు.

- వెంకటేశ్వర్లు, అయిటిపాముల, కట్టంగూరు

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి



మండల పరిధిలోని ఓ ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధిహామీ పనులకు తన సొంత వాహనం ఉపయోగించడమే కాకుండా కూలీలను తరలించేందుకు చెల్లించాల్సిన బిల్లులను కూడా తన జేబులోనే వేసుకుంటున్నాడు. ఈ తంతంగం రెండేళ్లుగా జరుగుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీనికి తోడు ఆ ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి కూలీలకు సరైన వేతనం ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతూ లక్షల రూపాయలు సంపాదించాడు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి సదరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

- తిరుమలగిరిసాగర్ మండల వాసులు

నైట్ డూటీలు రద్దు చేయాలి



జిల్లాలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్ నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కేటాయించిన టైం టేబుల్ ప్రకారం పనిచేస్తున్నా నాన్‌టీచింగ్ సిబ్బందికి నైట్ డ్యూటీలను సైతం వేస్తున్నారు. నిబంధనల మేరకు విద్యార్థినులకు వంటలు వండి, పిల్లలకు వడ్డించి అన్ని రకాల సేవలు చేస్తున్న తమకు నైట్ డ్యూటీలు సైతం వేసి వేధింపులకు గురిచేస్తున్నారు. దీనిపై సత్వరమే విచారణ జరిపించి తగిన న్యాయం చేయాలి.

- నర్మద,నల్లగొండ

పత్తిలో అంతరకృషితో కలుపు నివారణ

కేతేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో రైతులు సాగు చేసిన పత్తి పంటలో వచ్చే కలుపు నివారణకు అంతరకృషి మేలని మండల వ్యవసాయ అధికారి బి.పురుషోత్తం సూచించారు. మండలంలోని తుంగతుర్తి గ్రామంలో సోమవారం ఆయన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తిలో వివిధ రకాల కలుపును గమనించిన ఆయన కలుపు నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. అంతర కృషితో కలుపు నివారణ వీలుగానప్పుడు క్విజాలోఫాస్ ఇ ఇథైల్ 400మి.లీ., 200లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. వెడల్పాటి ఆకు కలిగిన కలుపు ఉంటే పైరితాయో బ్యాక్ సోడియం 250మి.లీ. 200లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయడం ప్రయోజనకారిగా ఉంటుందని తెలిపారు. సిఫారసు మేరకు నత్రజని, పొటాష్ ఎరువులను నాలుగు సమభాగాలుగా చేసి పంట 20, 40, 60, 80 రోజుల వయస్సులో వేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో వెంట రైతులు వెంకన్న, కె.శోభన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

శాలిగౌరారం, జూలై 7(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని శాలిగౌరారం సింగల్‌విండో చైర్మన్ తాల్లూరి మురళి అన్నారు. మండలంలోని మాదారం(కలాన్) గ్రామంలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సోమవారం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇళ్లు మంజూరైన వారు వెంటనే నిర్మించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీసెల్ మండల అధ్యక్షుడు నోముల రవి, మాజీ ఎంపీటీసీ నోముల జనార్ధన్, నాయకులు తోటకూరి పరశురాములు, హౌసింగ్ ఏఈ శ్యామ్, గ్రామ కార్యదర్శి బండారు శివ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి

మునుగోడు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా కార్యదర్శి బూడిద లింగయ్యయాదవ్ అన్నారు. మండలంలోని ఇప్పర్తి గ్రామంలో కొండోజు ప్రకృతమ్మ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. నిరుపేదల సొంత ఇంటి కలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనని అన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు దుర్గంపూడి పద్మారెడ్డి, చీమల రాజుయాదవ్, ఆవుల శ్రీనివాస్ యాదవ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ లింగస్వామి గ్రామపంచాయతీ కారోబార్ ఎర్రగోని లింగయ్యయాదవ్, మద్ది చంద్రారెడ్డి, ఈరటి సైదులుయాదవ్, కొండోజు వెంకటేశ్వర్లు, నక్కల గాంధీ, పరమేష్, శేఖర్, విఠలాచారి, రాంరెడ్డి, కవిత, నీరజ పాల్గొన్నారు.

వెల్మకన్నె గ్రామంలో కంపచెట్లు తొలగింపు

గట్టుప్పల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలో రోడ్డుకు అడ్డంగా పెరిగిన కంప చెట్లను కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రావుల రమేష్ ఆధ్వర్యంలో తొలగించారు. వెల్మకన్నె గ్రామంలో వెల్మకన్నె నుంచి కొంపెల్లి వెళ్లే దారిలో ముత్యాలమ్మ గుడి నుంచి శ్మశావాటిక వరకు కంపచెట్లు రోడ్డుకు అడ్డంగా పెరిగి ప్రమాదకరంగా మారాయి. ఈ విషయాన్ని రావుల రమేష్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన కంపచెట్లను తొలగించారు. కార్యక్రమంలో వెల్మకన్నె గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఎల్లప్ప, మల్లయ్య, శంకర్, రాజు, శ్రీకాంత్, భీమనపల్లి సుధాకర్, లింగయ్య, మహేష్, ప్రవీణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

నల్లగొండరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, అన్ని రకాల మందులు సరఫరా చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కేంద్రాస్పత్రిని సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ జిల్లా ఆస్పత్రిలో గర్భిణులకు ఐరన్ సిరప్‌లు, టాబ్లెట్లు ఇవ్వడం లేదని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అందజేసిన న్యూట్రిషన్ కిట్ ఎందుకు ఆపివేశారని? వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. డాక్టర్లు సమయపాలన పాటించాలని కోరారు ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణంలో ఉన్నందున అన్ని రకాల వైద్య సేవలు అందించడానికి ఆటంకంగా ఉందని వెంటనే నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలేబోయిన వరలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ, జిట్టా సరోజ జిల్లా ఆఫీస్ బేరర్స్ తుమ్మల పద్మ, భూతం అరుణ, పాదూరి గోవర్ధన కౌసల్య, జంజిరాల ఉమ తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో గర్భిణులతో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

సమాచారం

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కట్టంగూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ నల్లగొండ అధ్యక్షుడు మల్లారెడ్డి, సెక్రటరీ చిలుకూరు రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని మునుకుంట్ల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు రూ.15వేలు విలువైన నోట్ పుస్తకాలు, స్టేషనరీ వస్తువులను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ క్లబ్ సెక్రటరీ జానకిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, అశోక్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం షమీమ్ బేగం తదితరులు ఉన్నారు.

ట్యాక్స్ పేయర్ సంఘం ఏర్పాటుకు కృషి

శాలిగౌరారం, జూలై7(ఆంధ్రజ్యోతి): పన్ను చెల్లింపుదారుల హక్కుల సంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు సామాజిక కార్యకర్త యంపల్ల పురుషోత్తంరెడ్డి తెలిపారు. మండలంలోని ఊట్కూరు గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ప్రభుత్వానికి ప్రతి వస్తువుకు పన్నులు కడుతుంటే అధికారులు ప్రజలకు సర్వీస్ ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రభుత్వాధికారులను చట్టం ద్వారా ప్రశ్నిస్తూ వారి హక్కులను పొందే విధంగా చేయనున్నట్లు తెలిపారు. త్వరలోనే కమిటీ ఏర్పాటు చేసి కార్యాచరణను ప్రకటిస్తామని రాష్ట్రవ్యాప్తంగా టాక్స్‌పేయర్‌కు అందుబాటులో ఉంటామని తెలియజేశారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాలరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లవెల్లంలకు చెందిన బైరు బుగ్గమ్మ మృతి చెందగా ఆమె చిత్రపటానికి సోమవారం మాజీ సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మృతురాలి కుమారుడు బైరు వెంకన్నకు రూ. 5వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో అనంతుల శంకరయ్య, గుణగంటి సత్తయ్య, పానుగుళ్ల బుచ్చిరాములు, జోగు లింగస్వామి పాల్గొన్నారు.

యూరియా అధిక మోతాదు పంటలపై ప్రభావం

మునుగోడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): యూరియా అధిక మోతాదులో వాడితే భూమిలో సూక్ష్మజీవులు చనిపోయి నేల సారం దెబ్బతినటంతో పాటు నీటి నిల్వ సామర్థ్యం తగ్గి పంటల దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఏవో పద్మజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట సాగులో నిర్దేశించిన ప్రకారం యూరియా మోతాదును అవసరం మేరకు వాడుకోవాలని సూచించారు.

విద్యార్థులకు బూట్లు, సాక్స్‌లు పంపిణీ

చిట్యాలరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రతీ ఒక్కరు తోడ్పాటునందించాలని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ సిలివేరు చంద్రావతి, లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ స్నేహ అధ్యక్షురాలు కంభంపాటి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని నేరడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నల్లగొండలోని లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ స్నేహ ఆధ్వర్యంలో సోమవారం లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ సిలివేరు చంద్రావతి, బూట్లు, సాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వట్టిపల్లి పద్మ, మామిడి పద్మ, జెల్లా ఇందిర, గోలి రజని, పుష్ప, శారత, హెచ్‌ఎం నాగరాజు, టీచర్లు పాల్గొన్నారు.

మతిభ్రమించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

నకిరేకల్, కేతేపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు మతి భ్రమించి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు.సోమవారం పట్టణంలోని పన్నాలగూడెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుడి హోదాలో చర్చకు రమ్మని కేసీఆర్‌ను కోరినా రాకుండా ఫామ్‌హౌజ్‌కే పరిమితమయ్యారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిన విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా కూలిందన్నారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలో లక్ష నాగళ్లతో రామోజీ ఫిలిం సిటీని దున్నిస్తానన్న కేసీఆర్ తర్వాత ఏం చేశారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీలో దయ్యాలు ఉన్నాయని కవితే బహిరంగంగా చెప్పారన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి గుండు సున్న తప్పా ఒక్క సీటు కూడా రాలేదని అహంకార మాటలు మాట్లాడిన నేతలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. సమావేశంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఆరు గ్యారెంటీల మెనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య శ్రీనివాస్, పన్నాల రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కేతేపల్లి మండలంలోని 15గ్రామాల్లో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటైన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీరేశం మాట్లాడారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనందున పేదలు అవస్థలు పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేసిందని అన్నారు. మిగిలినవారికి మరో విడతలో ఇళ్లు కేటాయిస్తామన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలు అండగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ప్రతీ సోమవారం బిల్లుల చెల్లింపు చేస్తామన్నారు. అదనపు వ్యయం చేయకుండా ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుని సంతోషంగా ఉండాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గుత్తా మంజులమాధవరెడ్డి, తహసీల్దార్ యు.రమాదేవి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, మార్కెట్ డైరెక్టర్ లతీఫ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, కోట మల్లికార్జునరావు, బి.సుందర్, కోట పుల్లయ్య, పి.ఇందిర, కె.మహేందర్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.



నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరేశం

ఓటరు జాబితా సవరణను పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీదేవి

మర్రిగూడ, చిట్యాల రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నూతన ఓటరు జాబితాలో నమోదు సవరణలను బూత్ స్థాయి అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఎలక్షన్ బూత్ స్థాయి అధికారులకు జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ ట్రైనర్లు తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయక్, బీఎల్‌వోలు ఉన్నారు.

రైతులకు నోటీసులు జారీ చేయాలి

భూ భారతిలో రైతుల దరఖాస్తులకు నోటీసులు జారీ చేసి సమస్యల పరిష్కరించాలని ఆర్డీవో శ్రీదేవి అన్నారు. సోమవారం మర్రిగూడ తహసీల్దార్ కార్యాలయంకు వచ్చిన సందర్భంగా రెవెన్యూ అధికారులతో ఆమె మాట్లాడారు. భూ మస్యలు ఆగస్టు 17వ తేదీ వరకు పరిష్కారం అయ్యే విధంగా చూడాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఈమె వెంట తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయక్, ఆర్‌ఐలు సిబ్బంది ఉన్నారు.

ఓటర్ల నమోదులో బీఎల్వోలది కీలకపాత్ర

గ్రామాల్లో నూతన ఓటర్ల నమోదులో బీఎల్వోలది కీలక పాత్ర అని నకిరేకల్ నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఎన్నికలపై బీఎల్వోలకు చిట్యాలలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళి పాటించని బీఎల్వోలపై చర్యలు తీసుకోవడమే కాకుండా, విధుల నుంచి పూర్తిగా తొలగించే హక్కు కూడా ఎన్నికల సంఘానికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చిట్యాల, రామన్నపేట తహసీల్దార్లు జి.కృష్ణ, లాల్‌బహదూర్‌శాస్త్రి, నాయబ్ తహసీల్దార్, విజయ, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ అరవింద్, రామన్నపేట సీనియర్ అసిస్టెంట్ వినీత, శిక్షకులు సుధాకర్‌రెడ్డి, రాములు, ఆర్‌ఐలు, ఉద్యోగులు, బీఎల్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం : ఎమ్మార్పీఎస్

నల్లగొండ టౌన్, మునుగోడు, కనగల్, చిట్యాల రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ అన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నల్లగొండలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గొల్లగూడ, పెద్ద బండ, మండలంలోని బుద్ధారం గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణమాదిగ పుట్టినరోజు సందర్భంగా మునిసిపల్ మాజీ చైర్మన్ బొర్ర సుధాకర్, కూరుపాటి కమలమ్మ, పెరికె శ్రీనివాసులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకుడు మల్లెపాక వెంకన్న, లంకపల్లి నగేష్ ఊదరి వెంకటేశం, కత్తుల మారయ్య, పేర్ల కృష్ణయ్య, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త వెంకన్న, జలందరు, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు మాసారం వెంకన్న, బొజ్జ నాగరాజు, పెరిక నరసింహ, కత్తుల గిరి, కత్తుల యాదగిరి, కందుల మోహన్, దుబ్బ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడు మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రావు భవనం ఆవరణలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి శంకర్ ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పుట్టినరోజును పురస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు దుబ్బ గోపాల్, పందుల మల్లేష్, పర్వతాలు, అంజయ్య, లక్ష్మణ్, వెంకన్న, సింగపంగ నర్సింహ, బోయపర్తి యాదయ్య, నరేష్, పందుల అశోక్, దుబ్బ పురుషోత్తం, పందుల బాస్కర్, నర్సింహ, రవివర్మ, లింగస్వామి, నరేష్, వినయ్, ప్రవీణ్, నర్సింహ, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

● కనగల్ మండల కేంద్రమైన కనగల్, రాంచంద్రపురం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. మంద కృష్ణమాదిగ పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసారు. కార్యక్రమాల్లో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు కందుల మోహన్, ఎంఎస్పీ మండల ఇన్‌చార్జి దుబ్బ సత్యనారాయణ నాయకులు దుబ్బ దేవేందర్, కొమ్ము యాదయ్య, దుబ్బ గోపాల్, పేర్ల శంకర్, మల్లెపల్లి నర్సింహ, సైదులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో ప్రదర్శన నిర్వహించి ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. మందకృష్ణమాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బుస్సు శ్రీకాంత్, బుస్సు శంకర్, దుబ్బ కుమారస్వామి, బుస్సు నర్సింహ, కత్తుల లింగస్వామి, బుస్సు మధుసూదన్, రెడపాల మల్లయ్య, బుస్సు శ్రీనివాస్, రెడపాక శంకర్, కాసర్ల రాజు, జిల్లా వెంకటేష్, మత్స్యగిరి, లింగస్వామి, ఆనంద్, లింగస్వామి, అశ్వినికుమార్, మురళి, తరుణ్, మధు, వెంకటేష్, భాస్కర్, ప్రశాంత్, వరప్రసాద్, జామువా, ధర్మతేజ, సిద్ధు పాల్గొన్నారు.



నల్లగొండలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

సంస్థాగత ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్


(5వపేజీ తరువాయి)

పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సైతం నాయకుల నడుమ పోటాపోటీ నెలకొంది. ప్రస్తుతం పట్టణంలో కొనసాగుతున్న రెండు పోటీ కమిటీల అధ్యక్షులు తిరిగి పట్టణ అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, చిలుకూరి బాలకృష్ణ, కొమ్ము శ్రీనివాస్ ఈ పదవి కోసం యత్నిస్తున్నారు. దేవరకొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు ఎండీ యూనస్‌కే మరోసారి అధ్యక్ష పదవి దక్కే అవకాశం ఉంది. ఆయన గత పదేళ్లుగా పట్టణ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మాజీ సర్పంచ్ పున్నా వెంకటేశ్ కూడా పట్టణ అధ్యక్ష పదవి ఆశిస్తున్నారని, ఎమ్మెల్యే నిర్ణయం మేరకు పదవి ఎవరికి దక్కేది ఖరారవుతుందని పార్టీలో చర్చ సాగుతోంది. నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, చిట్యాల పట్టణ కమిటీల అధ్యక్ష పదవులకు ఇప్పటికే ఏకగ్రీవంగా అభ్యర్థులను ఎన్నుకున్నారు. చిట్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జడల చినమల్లయ్య, నకిరేకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు లింగాల వెంకన్నను ఎన్నుకున్నారు. చండూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్‌ను మరోసారి కొనసాగించే అవకాశం ఉందని క్యాడర్ చెబుతోంది. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆశీస్సులు సైతం ఆయనకు ఉండడంతో ఈ పదవి ఆయనకే ఖాయమని చెబుతున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా, నాగార్జునసాగర్ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవులను పలువురు స్థానిక నాయకులు ఆశిస్తున్నప్పటికీ, ఇంకా ఎవరికి ఇవ్వాలనే విషయంలో తుది నిర్ణయం తీసుకోలేదని, ఎవరికి ఇచ్చినా అభ్యంతరం లేదని, అందరి ఆమోదయోగ్యమైనవారికే పదవులు దక్కుతాయని పేర్కొంటున్నారు. ఏది ఏమైనా సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను నియమించడంతో ఈ ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని కార్యకర్తలు పేర్కొంటున్నారు.

వైటీపీఎస్‌కు లోటు లేకుండా బొగ్గు!

(5వపేజీ తరువాయి)

నాటికి కమిషన్ పూర్తయి మొత్తం ప్లాంటు ద్వారా విద్యుదుత్పాదన జరగనుంది. ఈ నేపథ్యంలో విద్యుదుత్పత్తికి ప్రతి రోజూ అవసరమయ్యే 50వేల మెట్రిక్‌టన్నుల బొగ్గును రవాణా చేసేందుకు రోజూ 12 నుంచి 14 రైల్వే ర్యాకులు డిసెంబరు నాటికి అందుబాటులో ఉంచాలని జెన్‌కో అధికారులు సూచించారు. అందుకోసం రైల్వేశాఖ ఇప్పటికే రూ.500కోట్ల వ్యయంతో జానపహాడ్ టేకాఫ్ పాయింట్ నుంచి వైటీపీఎస్ ప్లాంటు వరకు ప్రత్యేకంగా రైల్వేలైన్ నిర్మాణం పూర్తిచేసింది. అదేవిధంగా ప్లాంటు వద్ద మిగిలిన రైల్వే సైడింగ్ పనులు, ఇతర పెండింగ్ పనులన్నింటినీ డిసెంబరు లోగా పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ లైన్ ద్వారా ప్రస్తుతం రోజూ నాలుగు ర్యాకుల బొగ్గు సరఫరా జరుగుతోంది. అదేవిధంగా డిసెంబరు నాటికి రోజుకు 14 ర్యాకుల బొగ్గు సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ రైల్వేశాఖ చేపట్టింది. ప్రస్తుతం ఉన్న రైల్వే నెట్‌వర్క్ ద్వారానే సింగరేణి గనుల నుంచి ఈ ర్యాకులను సమకూర్చేందుకు రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ మార్గాల్లో రైల్వే రద్దీని తగ్గించడం, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఉండేందుకు వీలుగా మోటమర్రి-విష్ణుపురం, డోర్నకల్-భద్రాచలం రైల్వేలైన్ల డబ్లింగ్ కూడా చేపట్టామని రైల్వే అధికారులు వివరించారు. అయినా సింగరేణి నుంచి బొగ్గు రవాణాకు ఇతర ప్రత్యామ్నాయాలను సైతం పరిశీలించాలని రైల్వే అధికారులకు జెన్‌కో అధికారులు సూచించారు. రైల్వే, జెన్‌కో అధికారుల సమన్వయంతో వచ్చే డిసెంబరు నాటికి అన్ని పనులు పూర్తిచేయడంతో పాటు, ప్రతి రోజూ కనీసం 14 ర్యాకుల బొగ్గు వైటీపీఎస్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలని సమీక్ష సందర్భంగా జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా సూచించినట్లు జెన్‌కో అధికారులు పేర్కొన్నారు. సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో జెన్‌కో డైరెక్టర్లు బి.నాగ్యా (కోల్ అండ్ లాజిస్టిక్స్), ఎ.అజయ్ (సివిల్), దక్షిణమధ్య రైల్వే చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె.పద్మజ, దక్షిణమధ్య రైల్వే సీఎఫ్‌టీఎం ఆర్.సుదర్శన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	529.10 (166.3946)	58,780	4,724
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.65 (3.60)	68.78	68.78
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	154.329 (19.5)	నిల్	7,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210

వైటీపీఎస్‌కు లోటు లేకుండా బొగ్గు!

- రవాణాలో ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయం
- రైల్వే, జెన్‌కో అధికారులతో జెన్‌కో సీఎండీ సమీక్ష
- సరఫరాకు సన్నాహాలు
- డిసెంబరు నుంచి రోజూ 14 ర్యాకుల ద్వారా 50వేల మెట్రిక్‌టన్నుల బొగ్గు



యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటుకు అవసరమైన బొగ్గు సరఫరాపై జెన్‌కో, రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది. 4వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ పవర్ ప్రాజెక్టు పూర్తిగా అందుబాటులోకి వస్తే ప్రతి రోజూ కనీసం 50వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరమని అధికారులు అంచనావేశారు. ఈ బొగ్గు ను సింగరేణి సంస్థ సరఫరా చేయనుంది. సింగరేణి నుంచి ప్రతి రోజూ కనీసం 12 నుంచి 14 రైల్వే ర్యాకుల ద్వారా రవాణా చేస్తేనే ప్లాంటుకు అవసరమైన బొగ్గు అందుబాటులో ఉంటుంది. బొగ్గు రవాణా కార్యాచరణ నిమిత్తం సోమవారం హైదరాబాద్‌లో విద్యుత్ సౌధలో జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జెన్‌కో, దక్షిణ మధ్య రైల్వే అధికారులు బొగ్గురవాణాపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంటులో ప్రస్తుతం యూనిట్-2 (800 మెగావాట్లు)లో విద్యుదుత్పాదన జరుగుతోంది. యూనిట్-1 ఈ నెలాఖరులోగా కమిషన్ కానుండగా, మిగిలిన మూడు యూనిట్లు వచ్చే ఫిబ్రవరి

మిగతా 8వ పేజీలో...

సంస్థాగత ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్



స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ సంస్థాగత కమిటీల నియామకాలు పూర్తిచేయాలని, ఈనెల 30లోగా అన్నిస్థాయిల్లో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. గ్రామ, మండల, బ్లాక్, పట్టణ, జిల్లా కమిటీల నియామకాల కోసం ఇప్పటికే సన్నాహక సమావేశాలు, ప్రాథమిక జాబితాల రూపకల్పన పూర్తయింది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

- ఈనెల 30లోగా అన్ని కమిటీల నియామకం
- స్పష్టమైన ఆదేశాలిచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

స్థానిక ఎన్నికల్లో పోటీపై, నామినేటెడ్ పదవులపై స్పష్టత వస్తే తప్ప ఈ పదవులు తీసుకునేందుకు పలువురు నాయకులు సిద్ధంగా లేరు. దీంతో ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు రంగంలోకి దిగి పదవులు తీసుకునేలా వారిని బలవంతంగా ఒప్పించే పరిస్థితి జిల్లాలోని పలు పట్టణాలు, మండలాల్లో నెలకొంది. ఈనెల 30లోపు సంస్థాగత ఎన్నికలను పూర్తిచేసే నిమిత్తం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఇన్‌చార్జిగా ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్‌ఏ.సంపత్‌కుమార్‌ను అధిష్ఠానం సోమవారం నియమించింది. దీంతో త్వరలో జిల్లాలో సంస్థాగత ఎన్నికల ప్రక్రియ చివరిదశకు చేరనుంది.

డీసీసీపై కొనసాగుతూనే ఉన్న ఉత్కంఠ...

రాష్ట్రంలోనే పెద్ద జిల్లా కావడంతో పాటు, కీలక నేతలున్న నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం కీలక నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. పీసీసీ ఉపాధ్యక్షులుగా నియమితులైన గుమ్మల మోహన్‌రెడ్డి, కొండేటి మల్లయ్యతో పాటు పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాష్‌నేత, తదితర నాయకులు ఈ పదవి దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. మంత్రి, మాజీ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆశీస్సులు సాధించడం ద్వారా పదవి దక్కించుకునేందుకు వీరు ప్రయత్నాలు చేస్తుండడంతో ఎవరిని వరించనుందనేది ఆసక్తికరంగా మారింది. డీసీసీ అధ్యక్ష పదవిపై అధిష్ఠానం ఒక నిర్ణయానికి వస్తే, ఆ తదుపరి బ్లాక్, మండల, గ్రామ కమిటీల నియామకాలను ఇప్పటికే సిద్ధం చేసిన జాబితా మేరకు ప్రకటించేందుకు పార్టీ రంగం సిద్ధం చేసింది. నూతనంగా నియమితులైన పార్టీ ఇన్‌చార్జి సంపత్‌కుమార్ వారం, పది రోజుల్లో ఈ పదవుల నియామకాలపై తుది జాబితాను ఖరారుచేసి పీసీసీ అధ్యక్షుడికి ఇవ్వనున్నట్లు సమాచారం.

పట్టణ కమిటీ అధ్యక్ష పదవులపై నజర్

కీలకమైన నల్లగొండ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి పోటాపోటీ నెలకొంది. ఈ పదవిని పట్టణ నాయకులు అల్లి సుభాష్‌యాదవ్, పాదం అనిల్‌కుమార్, గోగుల గణేశ్, పెరిక వినాయకరాజ్ (చిట్టి), మహ్మద్ సమ్మద్ తదితరులు ఆశిస్తున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సొంత నియోజకవర్గం కావడం, జిల్లా కేంద్రం కావడంతో ఈ పదవికి ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు, మంత్రి కోమటిరెడ్డి ఆశీస్సులు పొందేందుకు నాయకులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో మరో కీలకమైన మిర్యాలగూడ

మిగతా 8వ పేజీలో...

'ప్రజావాణి' ఫిర్యాదులపై దృష్టిసారించాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి


ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), జూలై 7 (ఆంధ్రజ్యోతి): 'ప్రజావాణి' ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా స్థాయిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు మండల స్థాయికి పంపుతున్నారని, అలా చేయకుండా వారి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్‌కార్డుల దరఖాస్తులను పౌరసరఫరాల అధికారులు పర్యవేక్షించాలని, దరఖాస్తు తిరస్కరణకు గురైతే దరఖాస్తుదారులకు విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు వారి పరిధిలోని కేజీబీవీలను తనిఖీచేయాలన్నారు. కేజీబీవీల్లో తక్షణ పనుల నిమిత్తం రూ.20వేలు మంజూరు చేశామని, ప్రత్యేక అధికారులు వారికి నచ్చిన పనులు కాకుండా, అవసరమైన వాటిని ప్రతిపాదించాలన్నారు. చాలా కేజీబీవీల్లో కోతుల బెడద ఉందని, ఫెన్సింగ్ అవసరం ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, నారాయణ్ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, గృహనిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్, పాల్గొన్నారు.

భూములపై గిరిజనులకు హక్కులు కల్పిస్తాం

● మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పాల్గొన్న జానారెడ్డి, జైవీర్‌రెడ్డి

నల్లగొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ నియోజకవర్గంలో ఏళ్లుగా భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులకు హక్కులు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలో భూ సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూములపై హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే వివిధ నిబంధనలు చూపుతూ ఆ భూములు అటవీశాఖకు చెందినవని అటవీ అధికారులు కొర్రీలు పెడుతున్నారని అన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సమన్వయంతో పనిచేసి వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలన్నారు. పేద ప్రజలు దశాబ్దాల కాలంగా సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించే విషయంలో మానవీయ కోణంలో ఆలోచన చేయాలన్నారు. చిన్న సమస్యలను సాకుగా చూపి విషయాన్ని జటిలం చేయవద్దని అధికారులకు సూచించారు. సమావేశంలో మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, రెవెన్యూశాఖ కార్యదర్శి డీఎస్ లోకేష్‌కుమార్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఫారెస్ట్ అధికారి రత్నాకర్, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, నారాయణ్ అమిత్, పాల్గొన్నారు.

ఇంటర్‌లో విద్యార్థుల నమోదును పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న భీమ్‌సింగ్

కనగల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా కనగల్‌లో ఏర్పాటుచేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారి భీమ్‌సింగ్ అన్నారు. ఐఏఎస్ క్రిష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు సోమవారం కళాశాలను ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది వివరాలను ప్రిన్సిపాల్ సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగామాట్లాడుతూ అధ్యాపకులు చెప్పే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా విని మంచి ఫలితాలు సాధించాలన్నారు. క్రీడాసామాగ్రి కొనుగోలుకు కళాశాలకు రూ.10వేలను మంజూరు చేస్తానన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో బీమ్‌సింగ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డీఐఈవో దస్రూనాయక్ తదితరులున్నారు.

బాధితులకు సత్వర న్యాయం చేయాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్


బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు ఫోన్‌చేసి ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చే స్తున్నామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎస్పీ కార్యాలయానికి, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు మధ్యవర్తులను తీసుకురావద్దని, బాధితులు ప్రత్యక్షంగా కలిసి సమస్యలను వివరించి పరిష్కారం పొందాలని సూచించారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఖయ్యూంబేగ్

రాజకీయ లబ్ధికోసమే రోడ్డును అడ్డుకునే కుట్ర

నల్లగొండ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొంతమంది ముస్లిం నాయకులు వారి రాజకీయ లబ్ధి కోసమే లతీఫ్‌సాహెబ్ గుట్టపైకి రోడ్డు నిర్మించకుండా అడ్డుకోవాలని చూస్తున్నారని కాంగ్రెస్ మాజీ ప్రజా ప్రతినిధులు మహమ్మద్ ఖయ్యుం బేగ్, మహమ్మద్ ఇబ్రహీం, సయ్యద్ సమద్, మహమ్మద్ బషీరుద్దీన్ విమర్శించారు. సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లతీఫ్‌సాహెబ్ గుట్టతో పాటు బ్రహ్మంగారి గుట్టకు రోడ్డు నిర్మాణానికి రూ.140 కోట్లు మంజూరు చేయించారన్నారు. కొంతమంది నాయకులు ఒక వీడియోను విడుదల చేసి హద్దులు మీరి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, దీన్ని సహించేదిలేదని హెచ్చరించారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి కోట్ల రూపాయలతో లతీఫ్‌సాహెబ్ గుట్టకు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని చెప్పి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కోమటిరెడ్డి మంత్రి అయ్యాక గుట్టపైకి రోడ్డు నిర్మాణానికి సర్వే చేయించి నిధులు మంజూరు చేయించారన్నారు. సమావేశంలో ఫసహత్ అలీబాబా, మహమ్మద్ ఇర్ఫాన్, మహమ్మద్ మహబూబ్‌అలీ, అమేర్, ఖలీల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జహంగీర్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు


ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జేడీఏ శ్రావణ్‌కుమార్

నల్లగొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు ఉన్నాయని ప్రధానంగా యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని జేడీఏ శ్రవణ్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లాలో ప్రస్తుతం 57,270మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులు ఉన్నాయన్నారు. ఇందులో 24,929 మెట్రిక్‌టన్నుల యూరియా, డీఏపీ 2,926, ఎంవోపీ 2,269, ఎన్‌పీకేఎస్ 25,580, ఎస్ఎస్‌పీ 1,425మెట్రిక్ టన్నులు ఉందన్నారు. అదే విధంగా ఎఫ్‌వోఎం 35,700, కంపోస్టు ఎరువులు 103 మెట్రిక్ టన్నులు ఉందన్నారు. ఎమ్మార్పీకి మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలని ఏ ఒక్క రైతు కూడా అధిక ధరలకు కొనుగోలు చేయవద్దని సూచించారు. అవసరం మేరకు యూరియాను కొనుగోలు చేయాలని కొంత మంది యూరియా దొరకదన్నా అపోహలతో ముందుజాగ్రత్తగా కొనుగోలు చేసి పెట్టుకుంటున్నారన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన తరువాత తప్పనిసరిగా రశీదును జాగ్రత్త పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నల్లగొండ మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి


చెర్వుగట్టులో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరెడ్డి

నార్కట్‌పల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి పిన్నపురెడ్డి అనంతరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చెర్వుగట్టులో బిల్లాల సత్తిరెడ్డికి చెందిన 17.5ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరికి ప్రత్యామ్నాయంగా మూడు రెట్లు అధిక దిగుబడి, లాభాలను వచ్చే ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టిసారించాలన్నారు. ఎకరానికి 57 మొక్కలు నాటవచ్చని, నాలుగో ఏట నుంచి 30 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఎకరానికి కనిష్ఠంగా 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని, దీంతో రూ.1.20లక్షల నుం చి రూ.1.50లక్షల వరకు ఆదాయం సమకూరుతుందన్నారు.

మిగతా పంటలతో పోల్చితే ప్రకృతి వైపరీత్యాల నుంచి తట్టుకోవడమేగాక చీడ పీడల బెడద ఉండదన్నారు. మూడో ఏట నుంచి ఆయిల్‌పామ్ లో అంతర్‌పంటలు సాగు చేయవచ్చన్నారు. వంద శాతం రాయితీతో మొక్కలు పొందడమేగాక డ్రిప్ పరికరాలను కూడా సబ్సిడీపై ఇస్తామన్నారు. మొక్కల పెంపకానికి ఏటా ఎకరానికి రూ.4,200 చొప్పున నగదు బదిలీ ద్వారా నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖాధికారి శ్వేత, పతంజలి ఫుడ్స్ జిల్లా జీఎం రవీందర్‌రెడ్డి, ఆయిల్‌పామ్ కంపెనీ ప్రతినిధులు వినయ్, శ్రీనివాస్, వంశీ, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి, నర్సిరెడ్డి, రాములు, విజయ్,తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ వల్లే పనులు నత్తనడక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

మర్రిగూడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే చర్లగూడెం రిజర్వాయర్ పనులు నత్తనడక నడస్తున్నాయని ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రిజర్వాయర్లలో భూములు కోల్పోయి ముంపునకు గురైన గ్రామాల బాధిత భూనిర్వాసితులకు సరైన సమయంలో పరిహారం, పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించడంలో నిర్లక్ష్యం చేయడంతో పనులు నిలిచాయన్నారు. మండల ఇన్‌చార్జి కన్వీనర్ బుర్ర శేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎడ్ల పెద్దులు, అయితగోని యాదయ్య, జాల చంద్రయ్య, కారింగ్ యాదయ్య, దాసరి జంగయ్య, లక్ష్మమ్మ, మల్లయ్య, వీరితో పాటు పలువురు ఎమ్మెల్సీ సత్యం సమక్షంలో సీపీఐలో చేరారు.

పనులను తనిఖీచేసిన కేంద్ర బృందం

నాంపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిధులతో నాంపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పలు అభివృద్ధి పనులను నేషనల్ లెవెల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కేజీ.సలీంకుమార్, పీఆర్.సలీంమోన్ స్థానిక అధికారులతో కలిసి సోమవారం తనిఖీచేశారు. అదేవిధంగా మండల పరిధిలోని రాజ్యతండాలో చేపట్టిన అభివృద్ధి పనులను వారు తనిఖీచేశారు. కేంద్ర నిధుల అమలుచేస్తున్న వితంతు, దివ్యాంగుల, వృద్ధాప్య పెన్షన్, జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను తనిఖీచేసి సంబంధిత రికార్డులను పరిశీలించారు. మండల కేంద్రంలోని నర్సరీలను, గ్రామపంచాయతీ కార్యాలయంలోని రికార్డులను వారు పరిశీలించారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కేంద్రం అమలుచేస్తున్న పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బండతిమ్మాపురం గ్రామపంచాయతీ పరిధిలోని పగిడిపల్లిలో నిర్మిస్తున్న బ్రిడ్జిని పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో రామకృష్ణశర్మ, ఏపీవో గుంటుక వెంకటేశం, ఏపీఎం వినోద్, పంచాయతీరాజ్ ఏఈలు రామకృష్ణ, ఉదయ్‌రెడ్డి, తులసి నాయక్, తదితరులు పాల్గొన్నారు.



పీర్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

ముగిసిన పీర్ల ఊరేగింపు

హాలియా, జూలై 7(ఆంధ్రజ్యోతి): అనుముల మండలం ఇబ్రహీంపేట గ్రామంలో మొహర్రం ఊరేగింపు ముజావర్ల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ముస్లిం సోదరులు పాల్గొని అలాయిబలాయి ఆడి, పీర్ల దట్టీలను పూనకంతో ఉన్నవారు నిప్పులకొలిమి దాటారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అంజాద్‌ఖాన్, లతీఫ్‌ఖాన్, ఈసుబ్‌ఖాన్, అస్లం, అఫ్రోజ్‌ఖాన్, ఫెరోజ్‌ఖాన్, రహమత్‌ఖాన్, జన్ను, రియాజ్, ఇమ్రాన్, జల్ల పుల్లయ్య, ముజావర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బాసటగా..



చింతపల్లి: వీ.టి.నగర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందిస్తున్న పాండురంగారావు (ఫైల్)

- పేద విద్యార్థులకు ప్రోత్సాహం
- స్టడీ మెటీరియల్ అందజేత
- అండగా నిలుస్తున్న పీఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పాండురంగారావు

చింతపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులను పీఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చెల్లం పాండురంగారావు ప్రోత్సహిస్తున్నారు. తమ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న వారికి స్టడీ మెటీరియల్‌ను అందజేస్తూ వారికి ఆసరాగా నిలుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన పాఠశాలలు, మౌలిక వసతులు లేక నేలపై కూర్చొని చదువుకుంటున్న విద్యార్థుల ఇబ్బందులను కళ్లారా చూసి వారికి తన వంతుగా చేయూతనందించాలని పూనుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు తనవంతుగా ప్రోత్సహించాలనే తపనతో ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. మిర్యాలగూడ మండలం తమ్మడపల్లి గ్రామానికి చెందిన చెల్లం పాండురంగారావు పదేళ్లుగా గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్(మాల్)లో నివాసం ఉంటున్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులు చదివేందుకు వారికి ఆర్థిక ఇబ్బందులు పడుతుండటాన్ని ఆయన నేరుగా చూసి హృదయంచలించిపోయింది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం 2021లో 600 మందికి స్టడీ మెటీరియల్ తయారు చేయించి ఆయా పాఠశాలలకు వెళ్లి అందించారు. విద్యార్థులకు చాలా సులభంగా అర్థమయ్యేలా, వార్షిక పరీక్షలప్పుడు తక్కువ సమయంలో ఎక్కువ చదువుకునేలా స్టేట్ రీసోర్స్ పర్సన్‌తో మెటీరియల్ రూపొందించారు.

విద్యార్థులకు అందించిన పుస్తకాల వివరాలు ఇలా..

విద్యా సంవత్సరం	స్టడీ మెటీరియల్	ఖర్చు (రూ.లలో)
2021-2022	600	రూ.55,000
2022-2023	1200	రూ. 1,10,000
2023-2024	2200	రూ. 2,20,000
2024-2025	2600	రూ. 2,65,000

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా మార్చేందుకు..

నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మహబూబ్‌నగర్ జిల్లాలోని 35 ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. 2021, 2022, 2023న గణిత, సామాన్య శాస్త్ర మెటీరియల్‌ను తయారు చేస్తున్నారు. ఈ మెటీరియల్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆవిష్కరించారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం కృషి



విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం తనవంతు సహకారం అందిస్తున్నా. ఈ సేవ అదృష్టంగా భావిస్తున్నా. ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో మార్పు ఎంతో అవసరంగా భావించి, వారు జీవితంలో తమ కాళ్లపై నిలబడేందుకు నా వంతుగా కృషి చేస్తున్నా. దాతల సహకారంతో ప్రతీ సంవత్సరం స్టడీ మెటీరియల్ తయారు చేయించి నాలుగు జిల్లాలోని ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నాం. సమాజంలోని పేద విద్యార్థుల సంక్షేమానికి ఎల్లప్పుడు సహకారం అందిస్తాం.

- చెల్లం పాండురాంగరావు, పీఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్, వీటీనగర్

ఓటర్ జాబితా తయారీలో బీఎల్‌వోలది కీలకపాత్ర : ఆర్డీవో

చింతపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా తయారీలో బీఎల్‌వోలది కీలకపాత్ర అని ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. చింతపల్లి మండల కేంద్రంలో సోమవారం బూత్‌స్థాయి అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఓటరు జాబితాలో సవరణకు వచ్చే 6,7,8 ఎనిమిది ఫారాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి జాగ్రత్తగా నింపాలని సూచించారు. చనిపోయిన వారి ఓట్లను లిస్టులోనుంచి తొలగించటానికి ప్రతీ ఇంటికి వెళ్లి పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్‌శర్మ, ఆర్‌ఐ సునీత, అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లిలో శిక్షణలో పాల్గొన్న ఆర్డీవో రమణారెడ్డి, బీఎల్‌వోలు

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం : ఎమ్మార్పీఎస్



మిర్యాలగూడలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దేవరకొండ, కొండమల్లేపల్లి,మిర్యాలగూడటౌన్, దామరచర్ల, హాలియా, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరిగిందని ఎమ్మార్పీఎస్ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు పోతం సహదేవుడు అన్నారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని దేవరకొండలోని ఎస్సీకాలనీ, కొండభీమనపల్లిలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేసి నాయకులు మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా కాలయాపన చేయడంతో చదువుకున్న ఎస్సీ విద్యార్థులు నష్టపోయారని అన్నారు. అమరుల త్యాగాల ఫలితమే వర్గీకరణ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కంభాలపల్లి వెంకటయ్య, కొండ్రపల్లి రమేష్, మారేపల్లి యాదగిరి పాల్గొన్నారు. కొండభీమనపల్లిలో జరిగిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకల్లో దళితరత్న ఎర్ర ఆంజనేయులు, నల్ల శ్రీకాంత్, యాదగిరి, పెద్దిరాజు, రామచంద్రం పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని చిన్నఅడిశర్లపల్లిలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీరాములుమాదిగ, చింతకుంట్ల గ్రామంలో వస్కుల శ్రీనివాస్ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు గడ్డం గిరియాదవ్, రావుల వెంకటేశ్వర్లుయాదవ్, ఏడుపుల మల్లయ్యయాదవ్, పిల్లి శ్రీనివాస్‌యాదవ్, పందుల బద్రిగౌడ్, ఎడ్ల శ్రీనివాస్‌యాదవ్, దేవేందర్, శ్రీనివాస్, సాలయ్య, వెంకటయ్య, రమేష్, సంఘం మండల అధ్యక్షుడు ఎదుల ఎల్లయ్య, పంది శ్రీనివాస్‌రుద్రమ్మ, పంది అంజయ్య, రామస్వామి, లక్ష్మయ్య, సాయిలు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌లో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ కమిటీ మెంబర్ దైత సత్యం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మాదిగల ఆరాధ్యదైవం మందకృష్ణ మాదిగ అని అన్నారు. మాదిగల స మస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమించారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ పథకానికి, దివ్యాంగులకు పింఛన్ అమలయ్యేలా కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అహ్మద్‌ఖాన్, నాయకులు బకరం శ్రీనివాస్, మల్లెపాక వెంకన్న, అవిరెండ్ల సందీప్, సంధాల శంభయ్య, కిరణ్‌కుమార్, నాగరాజు, వెంకయ్య, పాండు, వెంకటేష్, శరత్‌కుమార్, రాజ్, అవినాష్ పాల్గొన్నారు.

● దామరచర్ల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని, ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సందాల శంబయ్య, కలకండ హరీష్ దండోరా జెండాను ఆవిష్కరించి కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సందాల మధు, కొమ్ము దాసు, గోపాల్, కోట వెంకులు, మట్టయ్య, గామయ్య, గోపి, గురవయ్య పాల్గొన్నారు.

● అనుముల మండలం నాయుడుపాలెం గ్రామంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామంలోని విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ నాయకులు మందా సైదులురావుగౌతమ్, విశ్రాంత పోలీస్ అధికారి యడవల్లి సోమశంకర్, జాతీయ మాజీ కబడ్డీ క్రీడాకారుడు యడవల్లి రాంబాబు, సైదులు, కొండా సతీష్, వడ్త్యా లక్ష్మణ్ పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

జీవో 282ను వెంటనే ఉపసంహరించుకోవాలి

దేవరకొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచుతూ విడుదల చేసిన 282 జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం దేవరకొండలో సీఐటీయూ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 282 జీవో పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు లాభదాయకంగా ఉంటుందన్నారు. కార్మికులపై పెనుభారం పడుతుందని, జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం 29కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్‌కోడ్‌లను అమలుచేసి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 282ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం జీవో 282 జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, సీఐటీయూ నాయకులు వడపల్లి యాదగిరి, బుడిగె వెంకటేష్, కార్మికులు ముత్తమ్మ, రాణమ్మ, అరవింద, మల్లమ్మ, అంజలి, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాల్వలపై అక్రమ నిర్మాణాలు

మాడ్గులపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మూసీ డిస్ట్రిబ్యూటరీ కాల్వలపై అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని చిరుమర్తి గ్రామంలో సర్వే నెం.26లో ఉన్న మూసీ డిస్ట్రిబ్యూటరీ కాల్వ-25పై రైతు అక్రమంగా స్లాబ్ నిర్మించుకోవడంతో తాము ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. వ్యవసాయ భూములకు సాగునీరు అందించే కాల్వపై ఎత్తుగా స్లాబ్ నిర్మించడంతో సాగునీరు తమ వ్యవసాయ భూములకు వెళ్లడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణాన్ని నిలిపివేయాలని రైతులు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆరోపించారు. కాల్వపై బ్రిడ్జి స్లాబ్ నిర్మించడంతో వర్షపునీరు, కాల్వ నీరు నిర్మాణం గుండా వెళ్లకపోవడంతో తమ పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వాటిని గుర్తించి వాటిని తొలగించి సమీప రైతుల ఇబ్బందులను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలు స్పష్టత ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ కోరారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సమీపిస్తున్న తరుణంలో బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి ప్రకటన వెలువడకపోవడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో జనాభాలో అధికశాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తామని ప్రకటించిందని ఆయన గుర్తు చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడి రాష్ట్ర పర్యటనలో రిజర్వేషన్లపై ప్రకటన చేయిస్తారని ఆశించినా బీసీలకు నిరాశే ఎదురైందని పేర్కొన్నారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే రిజర్వేషన్లపై ప్రకటించేలా బీసీ రాజకీయ ప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు ఒత్తిడి తేవాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్, నాయకులు నరికొండ రామకృష్ణంరాజు, కర్నాటి శివరామకృష్ణ, గిరిగాని బిక్షపతి, తవట సత్యం, పెంట అజయ్, మట్టరాజు, నారన్నగౌడ్, రాజగౌడ్, లవకుమార్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే హక్కుల సాధన

● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య

మిర్యాలగూడ, జూలై 6(ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక ఐక్య పోరాటంతోనే హక్కులను సాధించుకోగలమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ విధానాలకు వ్యతిరేకమని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 8 గంటల పనిదినాన్ని 10 గంటలకు పెంచుతామనడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్ట రక్షణకు, పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను రక్షించుకోవడానికి కేంద్రంపై ఐక్యంగా పోరాడాలని అన్నారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్ కుదింపు, ఆధార్ అనుసంధానం పేరుతో 7 కోట్ల మంది కూలీలను తొలగించారని విమర్శించారు. జూలై 9వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యుడు పిల్లుట్ల సైదులు అధ్యక్షత వహించిన సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వి.వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు పెంటమల్ల సుకన్య, నాయకులు కందుకూరి రమేష్, రెమిడాల బిక్షం, హనుమంతు, రంగానాయక్, సీతారాములు, పూలమ్మ, అలివేలు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల హక్కు

● ఎస్ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

మిర్యాలగూడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వాల భిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని భారత విద్యార్థి సమాఖ్య కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. సోమవారం ఎస్ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఫీజు బకాయిల విడుదల కోరుతూ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఏవో శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ స్కాలర్‌షిప్ అనేది పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యావకాశాలను అందించడానికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని అన్నారు. ఆరేళ్ల నుంచి సుమారు రూ.8వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 18 నెలలు గడుస్తున్నా ఫీజు బకాయిలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

తక్షణమే ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. డొనేషన్లు తీసుకుంటున్న ఇంజనీరింగ్ కళాశాలలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదా, డివిజన్ అధ్యక్షుడు జగన్‌నాయక్, నాయకులు న్యూమాన్, ప్రసన్న, సంపత్, అనిల్, అఖిల్, కోటేశ్, సాయి, మణి, బన్ని, తరుణ్, కిరణ్, వెంకటేశ్, రఘు పాల్గొన్నారు.

సంస్థాగత ఎన్నికలపై కాంగ్రెస్ ఫోకస్

(5వపేజీ తరువాయి)

పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి సైతం నాయకుల నడుమ పోటాపోటీ నెలకొంది. ప్రస్తుతం పట్టణంలో కొనసాగుతున్న రెండు పోటీ కమిటీల అధ్యక్షులు తిరిగి పట్టణ అధ్యక్ష పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, చిలుకూరి బాలకృష్ణ, కొమ్ము శ్రీనివాస్ ఈ పదవి కోసం యత్నిస్తున్నారు. దేవరకొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు ఎండీ యూనస్‌కే మరోసారి అధ్యక్ష పదవి దక్కే అవకాశం ఉంది. ఆయన గత పదేళ్లుగా పట్టణ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. మాజీ సర్పంచ్ పున్నా వెంకటేశ్ కూడా పట్టణ అధ్యక్ష పదవి ఆశిస్తున్నారని, ఎమ్మెల్యే నిర్ణయం మేరకు పదవి ఎవరికి దక్కేది ఖరారవుతుందని పార్టీలో చర్చ సాగుతోంది. నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, చిట్యాల పట్టణ కమిటీల అధ్యక్ష పదవులకు ఇప్పటికే ఏకగ్రీవంగా అభ్యర్థులను ఎన్నుకున్నారు. చిట్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జడల చినమల్లయ్య, నకిరేకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు లింగాల వెంకన్నను ఎన్నుకున్నారు. చండూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్‌ను మరోసారి కొనసాగించే అవకాశం ఉందని క్యాడర్ చెబుతోంది. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆశీస్సులు సైతం ఆయనకు ఉండడంతో ఈ పదవి ఆయనకే ఖాయమని చెబుతున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా, నాగార్జునసాగర్ పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవులను పలువురు స్థానిక నాయకులు ఆశిస్తున్నప్పటికీ, ఇంకా ఎవరికి ఇవ్వాలనే విషయంలో తుది నిర్ణయం తీసుకోలేదని, ఎవరికి ఇచ్చినా అభ్యంతరం లేదని, అందరి ఆమోదయోగ్యమైనవారికే పదవులు దక్కుతాయని పేర్కొంటున్నారు. ఏది ఏమైనా సంస్థాగత ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను నియమించడంతో ఈ ప్రక్రియ త్వరలో పూర్తవుతుందని కార్యకర్తలు పేర్కొంటున్నారు.

వైటీపీఎస్‌కు లోటులేకుండా బొగ్గు!

(5వపేజీ తరువాయి)

నాటికి కమిషన్ పూర్తయి మొత్తం ప్లాంటు ద్వారా విద్యుదుత్పాదన జరగనుంది. ఈ నేపథ్యంలో విద్యుదుత్పత్తికి ప్రతి రోజూ అవసరమయ్యే 50వేల మెట్రిక్‌టన్నుల బొగ్గును రవాణా చేసేందుకు రోజూ 12 నుంచి 14 రైల్వే ర్యాకులు డిసెంబరు నాటికి అందుబాటులో ఉంచాలని జెన్‌కో అధికారులు సూచించారు. అందుకోసం రైల్వేశాఖ ఇప్పటికే రూ.500కోట్ల వ్యయంతో జానపహాడ్ టేకాఫ్ పాయింట్ నుంచి వైటీపీఎస్ ప్లాంటు వరకు ప్రత్యేకంగా రైల్వేలైన్ నిర్మాణం పూర్తిచేసింది. అదేవిధంగా ప్లాంటు వద్ద మిగిలిన రైల్వే సైడింగ్ పనులు, ఇతర పెండింగ్ పనులన్నింటినీ డిసెంబరులోగా పూర్తిచేయాలని నిర్ణయించారు. ఈ లైన్ ద్వారా ప్రస్తుతం రోజూ నాలుగు ర్యాకుల బొగ్గు సరఫరా జరుగుతోంది. అదేవిధంగా డిసెంబరు నాటికి రోజుకు 14 ర్యాకుల బొగ్గు సరఫరా చేసేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ రైల్వేశాఖ చేపట్టింది. ప్రస్తుతం ఉన్న రైల్వే నెట్‌వర్క్ ద్వారానే సింగరేణి గనుల నుంచి ఈ ర్యాకులను సమకూర్చేందుకు రైల్వేశాఖ నిర్ణయించింది. ఈ మార్గాల్లో రైల్వే రద్దీని తగ్గించడం, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఉండేందుకు వీలుగా మోటమర్రి-విష్ణుపురం, డోర్నకల్-భద్రాచలం రైల్వేలైన్ల డబ్లింగ్ కూడా చేపట్టామని రైల్వే అధికారులు వివరించారు. అయినా సింగరేణి నుంచి బొగ్గు రవాణాకు ఇతర ప్రత్యామ్నాయాలను సైతం పరిశీలించాలని రైల్వే అధికారులకు జెన్‌కో అధికారులు సూచించారు. రైల్వే, జెన్‌కో అధికారుల సమన్వయంతో వచ్చే డిసెంబరు నాటికి అన్ని పనులు పూర్తిచేయడంతో పాటు, ప్రతి రోజూ కనీసం 14 ర్యాకుల బొగ్గు వైటీపీఎస్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలని సమీక్ష సందర్భంగా జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా సూచించినట్లు జెన్‌కో అధికారులు పేర్కొన్నారు. సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో జెన్‌కో డైరెక్టర్లు బి.నాగ్యా (కోల్ అండ్ లాజిస్టిక్స్), ఏ.అజయ్ (సివిల్), దక్షిణమధ్య రైల్వే చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ కె.పద్మజ, దక్షిణమధ్య రైల్వే సీఎఫ్‌టీఎం ఆర్.సుదర్శన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కేజీబీవీలో భోజనం తయారీని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

మిర్యాలగూడరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి జూలకంటి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, వంటగది, క్రీడా మైదానాన్ని, తాగునీరు, డ్రైనేజీని పరిశీలించారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన భోజనంతో పాటు మెరుగైన విద్యను అందించాలని, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో లావూరి బాలు, ఎస్‌వో పార్వతి, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.